
రామాయణం

# రామాయణ పరమార్థం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్ధికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org  Mobile App: Free Gurukul  email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul  Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# రామాయణ పరమార్థం

రచయిత

డా॥ ఇలపావులూరి పాండురంగరావు

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.

1999

# ముందుమాట

రామాయణం భారతీయ సంస్కృతిని శారీరక మీమాంసగా చిత్రిస్తుంది. మహాభారతం భారతీయ మనస్తత్త్వాన్ని మనోహరంగా వ్యాఖ్యానిస్తుంది. భాగవతం భారతీయ తత్త్వజిజ్ఞాసతో ఆత్మతత్త్వాన్ని పరమభాగవతపరంగా వివరిస్తుంది. కనుకనే రామాయణ భారత భాగవతాలు భారతీయ సంస్కృతికి కండపుష్టినీ, గుండెబలాన్నీ, నిండుదనాన్నీ సమకూర్చాయని భావింపబడుతున్నాయి.

ఆదికవి వాల్మీకి రచిత రామాయణాన్ని ఎన్ని మారులు ఎన్ని తీరుల్లో వ్రాసినా విని ఆనందించాలని సహృదయులు ఎదురుచూస్తుంటారు. ఎన్ని దృక్కోణాలతో ఈ కావ్యాన్ని ప్రవచించినా రసజ్ఞులైన భావుకులకు ఏదో ఒక నవ్యత గోచరిస్తూనే ఉంటుంది. అందువల్లనే రామకథకు పునరుక్తి దోషం లేదు. లేకపోగా, అది నిసర్గరమణీయతతో నిత్యనూతనంగా సాక్షాత్కరిస్తుంది.

అవతారికతో మొదలై భరతవాక్యంతో పరిసమాప్తి చెందిన తొమ్మిది పరిచ్ఛేదాలలో రామకథా సన్నివేశాలన్నింటినీ అనుక్రమంగా పేర్కొంటూ విద్వన్మణులు శ్రీ ఇలపావులూరి పాండురంగరావుగారు రామాయణ పరమార్థాన్ని బహువిధాల విశదీకరించారు. శక్తి, భక్తి, రక్తి -- అనే గుణత్రయిని సాధించేందుకు సీతారాములు తమ దాంపత్య జీవితాన్ని ధారపోశారని వారు ప్రశంసించారు. నీతిసంహితగా చూస్తే రామాయణంలో లేని నీతులు మరెక్కడా లేవనీ, తాత్త్వికదృక్పథంతో చూస్తే రామాయణం ఒక శారీరక మీమాంసగా కనిపిస్తుందనీ, షట్కాండలలో షట్చక్రాలు ఆ యా సన్నివేశాలలో కనిపిస్తాయనీ, సీతాసందర్శనమే సహస్రార బిందు సందర్శనమనీ తాత్త్విక దృష్టితో వివరించారు రచయిత.

పండిత పామర మనోరంజకమై సులభ సుందరశైలిలో శోభిస్తున్న "రామాయణ పరమార్థం" ఆకృతిలో చిన్నదైనా గుణంలో గొప్పది. ఉదాత్తమైన ఈ రచన తొలుత ఉపన్యాసాల రూపంలో ఢిల్లీలోని "అక్షర భారతి" సంస్థలో 1975 ప్రాంతంలో అవతరించింది. తదుపరి 1980లో

'యువభారతి' (హైదరాబాదు) ద్వారా పుస్తకరూపేణ ముద్రితమైంది. అనంతరం 1988లో తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఈ కృతిని ప్రచురించారు. ప్రతులు చెల్లిపోయినకారణంగా ఇపుడు పునర్ముద్రిస్తున్నాం. ఈ అక్షయ పాథేయాన్ని పాఠకులకు అందజేసే మహద్భాగ్యం గ్రంథకర్త ఆత్మజుణ్ణి అయిన నాకు దక్కటం నా అదృష్టం. సహృదయ పాఠకులు ఎప్పటిలాగే ఈ సరసకృతిని సమాదరిస్తారని ఆశిస్తున్నాం.

డా|| ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# మాట వరుస

దాదాపు అయిదారు సంవత్సరాల నాటిమాట. కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీజయేంద్రసరస్వతీ గురువర్యులు ఢిల్లీ విచ్చేసినపుడు వారికి స్వాగతం చెప్పే సదవకాశం నాకు లభించింది. అంతకు ముందు వారితో బొత్తిగా పరిచయం లేకపోయినా ఆ కొద్ది క్షణాల్లోనే వారు నా స్వాగత వాక్యాల్లోని సారస్యాన్ని గ్రహించి నన్ను అనిర్వచనీయమైన వాత్సల్యంతో అనుగ్రహించారు. వారి చిద్విలాసంలో చిరస్థాయిగా నిలిచి పోయిన నా వాగ్విలాసం ఆ తర్వాత కొద్ది రోజులకే 'శ్రీకామాక్షీవిలాస' మనే 'పౌరాణిక కావ్యంగా హిందీ భాషలో రూపొందింది. భగవత్పాదుల భవ్యముద్ర నా హృదయంలో అంకితమవుతూవున్న సమయంలోనే పుట్టపర్తి నుంచి శ్రీసత్యసాయిబాబా ఢిల్లీ వస్తున్నారని, వారు వేదికపై చేసే ప్రవచనాలకు నేను జనసామాన్యానికి అందుబాటులో ఉండే హిందీలో అనువదించాలని ఆదేశం అందింది. దానితో బాబాకు వాక్సారథిగా నేను చేసిన పరిచర్య వారి ప్రేమకు నన్ను పాత్రుణ్ణి చేసింది. ఈ రెండు సంఘటనలు ఒక దాని వెంట ఒకటి జరగటంతో ఢిల్లీలో అటు శంకరాచార్య శిష్యులకు, ఇటు బాబా భక్తులకు నా మీద అంతులేని అభిమానం ఏర్పడింది.

ఒకనాడు సాయంత్రం కొందరు తెలుగుసోదరులు మా యింటికి వచ్చి ఏదో ఒక రోజు ఏదో ఒక విషయాన్ని గురించి ఏవో కొన్ని మాటలు చెబితే వినాలని చాలామందికి కుతూహలంగా ఉందని అన్నారు. ఆ సంభాషణలో నాకు అచ్చమయిన ఆత్మీయతతోపాటు స్వచ్ఛమయిన సంకల్పం గోచరించింది. దాన్ని శివసంకల్పంగా భావించి 'అలాగే' అన్నాను. అందరం కలుసుకున్న తర్వాత అందరి ముఖాలు చూస్తే ఎందుకో రామా-యణాన్ని గురించి మాట్లాడుకోవాలనిపించింది. మామూలు సంభాషణ శైలిలో మాట వరుసగా రెండు మూడు గంటలు రామాయణ పరమార్థాన్ని గురించి ఏవేవో చెప్పుకుంటూ కులాసాగా కాలం గడిపాం. అందరి కోరికపై అలాంటి సమావేశాలు మరి మూడు జరిగాయి. రామాయణంలోని శక్తి

తత్త్వం, భక్తితత్త్వం, రక్తితత్త్వం ఆ మూడు సమావేశాల్లో ముచ్చటించు కున్నాం. ఆ తర్వాత ఉపనిషత్తులు, భగవద్గీతలు, సహస్రనామాలు--ఇలా చాలా విషయాలమీద చాలా సమావేశాలు జరిగాయి. శరన్నవరాత్రాల్లో సుందరకాండను గురించి నాలుగు రోజులు జరిగిన చర్చలు కరోల్ బాగ్‌లో సుందరరావుగారి 'బస'ను సుందర నిలయంగా రూపొందించాయి. ఆ క్షణాలు ఎలా గడిచాయో అనంతకాలంలోని ఆ క్షణాలకే తెలుసు. ఈ చెప్పుకున్న మాటలన్నీ అక్షరరూపం తాలిస్తే బాగుంటుందని అందరూ 'అక్షరభారతి' అనే చిన్న సంస్థను ఏర్పరచారు. 'ఆదిత్యహృదయం' అనే చిన్న పుస్తకంకూడా అచ్చువేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకు యం. శేషాచలం కంపెనీ మేనేజరు శ్రీ యం.యన్.రావుగారు ఆదిత్యహృదయమే కాక, 'ఆది-అనాది', 'విష్ణుసహస్రనామం', 'లలితా సహస్రనామం', 'గీతామృతం' -- అని అయిదు పుస్తకాలు ప్రాగ్భారతీ ప్రచురణల పేరిట అచ్చువేసి ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు అపారమైన సేవ చేశారు. 'గీతామృతం' వారి చివరి ప్రచురణ. ఈ ప్రాగ్భారతి ప్రచురణలు అయిదూ అక్షరభారతిలో బీజాక్షరాలను సంతరించుకుని వికసించినవే. ఒక్క 'రామాయణం' తప్ప అక్షర భారతిలో చర్చించుకున్న విషయాలన్నీ ప్రాగ్భారతి ప్రచురణల్లో వచ్చినట్టే. ఈ రామాయణ పరమార్థాన్ని తెలుగు పాఠకులకు అందించాలనే ఆలోచన 'యువభారతి'కి ఏర్పడటం ఆనందకరమైన విషయం. ప్రాగ్భారతి ప్రచురణల లోని నా 'పలుకుబడికి' పరవశించి అదే పద్ధతిలో అందరికీ అందుబాటులో ఉండే భాషలో రామాయణాన్ని గురించి వ్రాయవలసిందని యువభారతి అధ్యక్షులు డా॥ ఇరివెంటి కృష్ణమూర్తిగారు ఎంతో ఆప్యాయంగా నన్ను కోరారు. దానికి పర్యవసానమే యీ 'రామాయణ పరమార్థం'.

పరమార్థాన్ని వివరించేముందు ఇలా స్వార్థంతో సొంత గొడవతో విసిగించటం సమంజసం కాదని నాకు తెలుసు. కాని రామాయణంతో నాకుగల అనుబంధాన్ని వివరిస్తూ ముందుమాటగా రెండు మాటలు వ్రాయవలసిందని యువభారతి కార్యదర్శి నాగేశ్వరరావుగారు కోరారు. రామాయణం నాకు బహిఃప్రాణం. రామాయణం, భగవద్గీత నాకు సూర్యనాడి, చంద్రనాడి

లాంటివి. నాకే కాదు. ప్రపంచంలోని ప్రతి ప్రాణికి ప్రాణవాయువును ప్రసాదించగల పరమార్థం ఈ రెండుగ్రంథాల్లో ఉంది. కాని, గ్రహించగల శక్తి కావాలి. అనుగ్రహం గ్రహణశక్తిని బట్టి లభిస్తుంది. ఇలాంటి ఉత్తమ గ్రంథంలోని గ్రంథసారాన్ని పదిమందికి పంచిపెట్టాలని సంకల్పించిన యువ భారతికి భారతావని ఋణపడి వుంటుంది. దీనికి నేను నిమిత్తమాత్రుణ్ణి కావటం నా అదృష్టం .

ఇలపావులూరి పాండురంగరావు

# పునరుక్తి

సామాన్యంగా చెప్పిన మాట మాటి మాటికి చెప్పటం సంస్కార సంపన్నుల లక్షణం కాదు. కావ్య శాస్త్రంలో ఇలాంటి పునరుక్తి దోషంగా భావించబడుతుంది. కాని ఆదికావ్యమయిన రామాయణ మహాకావ్యాన్ని ఎంతమంది మహాకవులు ఎన్నిమారులు ఎన్ని తీరుల్లో వ్రాసినా మరొ-కరు మరోవిధంగా వ్రాస్తే విని ఆనందించాలని సహృదయులు ఎదురు చూస్తూ ఉంటారు. అలాగే ఎందరు సమీక్షకులు ఎన్ని దృక్కోణాలతో ఈ కావ్యాన్ని పరిశీలించి ప్రవచించినా హృదయజ్ఞులయిన భావుకులకు ఏనాటి కానాడు అందులో ఏదో ఒక నవ్య భావన గోచరిస్తూనే ఉంటుంది. అందువల్ల రామాయణం విషయంలో పునరుక్తి దోషం కాకపోగా అది నిసర్గ రమణీయతతో భాసించే నిరుక్తిలా నిత్య నూతనంగా సాక్షాత్కరిస్తుంది.

సకలగుణాభిరాముడయిన శ్రీరామచంద్రుడు దీనికి కథానాయకుడు కావటం ఇందుకు ప్రధానమయిన కారణం. ఆత్మీయుల కందరికీ ఆపదలు అంటకుండా చూచి అభీష్ట సంపదలను అనుగ్రహించే లోకాభిరాముడు మన-స్సులో మెదలగానే రెండు చేతులూ అప్రయత్నంగా కలుసుకొని నమస్సులు అర్పిస్తాయి. ఒకసారికాదు, మాటి మాటికి. 'లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్'-- అన్న నమోవాకంలో కూడా పునరుక్తి పుణ్యోక్తిగా పరిణమిస్తుంది.

అసలు కౌసల్యకు సుప్రజగా జన్మించిన అభిరామ గుణాకర దాశ రథి పునర్వసు నక్షత్రజాతకుడు. పుట్టటంతోనే పునరుక్తి ఆరంభమయింది. తాను ఒంటరిగా పుట్టలేదు, ఒంటరిగా పెరగలేదు. నలుగురితో పుట్టి పదిమందికోసం పాటుపడ్డ పరహితపరాయణుడు రాముడు. దిక్కులేని వారికి దిక్కు చూపించి, బలహీనులను బలపరిచి దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించి రాజ్యాన్ని త్యజించి లోకాన్ని సేవించిన మహా మానవుడు రాముడు. సహజంగా తనకు సంక్రమించిన పునర్వసు భావాన్ని తన జీవితంలోని ప్రతిక్షణంలో పుష్కలంగా పోషించుకున్నాడు. నిర్వాసితులకు

పునరావాసాన్ని కల్పించి, వసుమతిని వసుప్రదగా రూపొందించటమే పున ర్వసు పరాయణుడయిన రామాయణ కథానాయకుని జీవిత చరితార్థం. అదే రామాయణ పరమార్థం.

ఈ పరమార్థాన్ని నా నోట వినాలని దాదాపు పది పన్నెండు సంవత్స-రాల క్రితం ఢిల్లీలో కొందరు మిత్రులు నన్ను కోరారు. అంతకు ముందు పది సంవత్సరాల నుంచి నేను రాజధానిలో కాలక్షేపం చేస్తున్నా ఉన్నట్టుండి మా మిత్రులకు నామీద ఇంత అభిమానం ఎందుకు ఏర్పడ్డదని ఒక్కక్షణం నన్ను నేను ప్రశ్నించుకున్నాను. వెంటనే ఇద్దరు మహనీయులు స్ఫురించారు. కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీజయేంద్రసరస్వతీ సంయమీంద్రులు 1973లో ఢిల్లీ విచ్చేసిన సందర్భంలో వారికి స్వాగతం పలికే సదవకాశం నాకు లభించింది. అంతకు ముందు వారితో నాకు బొత్తిగా పరిచయం లేకపోయినా ఒక్కక్షణంలో వారు నన్ను సూదంటురాయిలా ఆకర్షించి అనిర్వచనీయమైన వాత్సల్యంతో ఆశీర్వదించి అనుగ్రహించారు. ఆ తర్వాత రెండు సంవత్సరాలకు పుట్టపర్తినుంచి శ్రీసత్యసాయిబాబాగారు ఢిల్లీ వచ్చినప్పుడు వారి దివ్యసందేశాన్ని ఆశువుగా వేదికపై అనువదించి చెప్పే అవకాశం తటస్థించింది. ఈ రెండు అవకాశాలూ నా మిత్రులకు నన్ను సన్నిహితుణ్ణి చేసి రాజధానిలో రామాయణ పరామర్శకు అనుకూలమయిన ఆవరణాన్ని సృష్టించాయి.

రామాయణంలోని శక్తి, భక్తి, రక్తి అనే గుణత్రయిని గురించి మూడు వారాలు ఇష్టా గోష్ఠి జరిగింది. క్రమంగా ఇలాంటి సాయంతన సమావేశాల సంఖ్య హెచ్చింది. భగవద్గీతలు, ఉపనిషత్తులు, సహస్రనామాలు -- ఇలాంటివి ఎన్నో విషయాలు మా అక్షర భారతీయులకు సాధక సామగ్రిని సమకూ-ర్చాయి. ఈ సాధనకు సాక్షర పరిణతిగా ఆది-అనాది, ఆదిత్య హృదయం, గీతామృతం, శ్రీవిష్ణుసహస్రనామం, శ్రీలలితా సహస్రనామం, రామాయణ పరమార్థం అనే ఆరు గ్రంథాలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో మొదటి అయిదు 'ప్రాగ్భారతీ ప్రచురణలు' అనే పేరిట స్వర్గీయులు శ్రీ ఎమ్.ఎన్.

రావుగారు శ్రద్ధాభక్తులతో ప్రచురించారు. చివరి గ్రంథం 'రామాయణ పరమార్థం' సికిందరాబాదులోని 'యువభారతి' ప్రచురణగా రూపొందింది. ప్రస్తుతం ఈ ఆరు రచనలూ ఏడుకొండలవాడి అండలో పునర్ముద్రణ పొందటం నా అదృష్టం.

పుష్కరం క్రితం రాజధానిలో రామాయణ పరమార్థంతో ప్రభవించిన యీ భావ పుష్కరిణి ఈనాడు స్వామిపుష్కరిణీ తీరాన్ని చేరుకోవటం శ్రీనివాసుల శివ సంకల్పానికి చిదాకార నిదర్శనం.

ఈ పునర్ముద్రణకు అనుగుణంగా తొలిపలుకుల సవరణ అవసరమైంది. దానికి ఫలశ్రుతి యీ పునరుక్తి. రామ కథకు పునరుక్తి దోషం లేదు కాబట్టి నా తొలిపలుకులకు కూడా ఆ దోషం లేదనే నా భావం. ఒక వేళ ఉన్నా అన్ని దోషాలనూ క్షమించేందుకు శ్రీనివాసమూర్తి ఉండనే ఉన్నాడు.

అజ్ఞానినా మయా దోషా నశేషా న్విహితా న్హరే,
క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైలశిఖామణే.

మకాం,
హనుమకొండ,
25-10-1985.

శ్రీచరణపరాయణుడు,
ఇలపావులూరి పాండురంగరావు.

# రామాయణంలో మూడు నగరాలు

ఒక విధంగా చూస్తే రామాయణం మూడు నగరాల ముచ్చటైన కథ. ఆ మూడు నగరాలివి. 1. మిథిల, 2. అయోధ్య, 3. లంక. ఆ నగరాలు వాటి పాలకుల ప్రవృత్తికి ప్రతీకలు. మిథిల నేలే రాజు జనకుడు. ఆయన రాజ్యచక్రం త్రిప్పుతున్న బ్రహ్మజ్ఞాని. తామరాకుపై నీటిబిందువు. రాజర్షి. ఆయనకు కన్న సంతానం లేదు; సంసారవిరక్తుడు కాబట్టి, దొరికిన బిడ్డ సీత పెంచిన సంతానం. మిథిలలో రెండు విశేషాలున్నాయి. ఒకటి శివధనుస్సు, రెండు సీత. సీత శివధనుస్సు నవలీలగా కదపగలిగింది. ఆమె మహామాయ. ఆమె తత్త్వము తెలిసినవాడు జనకుడు. ఆమెకు తగిన పురుషుణ్ణి అన్వేషించ నారంభించాడాయన. 'శివుని విల్లు వంచినవాడు సీతకు భర్త' అని చాటించాడు. ఎందరో యత్నించారు శివుని విల్లెత్త టానికి, దాన్ని వంచటానికి. అందరూ విఫలులయ్యారు. శివుని విల్లెక్కు పెట్టినవాడు మహామాయా విజయాన్ని సాధింపగల వివేకి అని జనకుని నిష్కర్ష. శ్రీరాముడు ఆ విల్లెత్తాడు, వంచాడు. త్రుటిలో రెండుగా విరిచాడు కూడా. జనకుడు సీతకు తగిన భర్త దొరికాడని సంతోషించాడు; పురుషాకృతిలో నున్న పురుషోత్తముని పోల్చుకున్నాడు.

రాముడు పురుషోత్తముడు. విల్లెత్తి మహామాయను భరించగలనని సూచించాడు. విల్లును వంచి మాయను నియమించగలనని నిరూపిం-చాడు. వింటిని విరిచి మాయను జయించగలనని చాటి చెప్పాడు. ఈ మూడు లక్షణాలనూ రాముడు రామాయణంలో ఆ తరువాత క్రమంగా ప్రకటించాడు. సీతను ప్రణయసూత్రంతో భార్యగా స్వీకరించి, వియోగంలో విప్రలంభాన్ని ప్రకటించాడు. కాని, అగ్నిపరీక్షతో నియమించాడు; ఉత్తర కాండలో అడవులలో పరిత్యజించాడు. రూపుకట్టిన ధర్మము రాముడు. అతనికి సీత ప్రాణము; కాని సీతకంటె ధర్మము ముఖ్యము. ధర్మధను వులో అతడు మాయను జయించును. శివధనుర్భంగ వీరుడైన రాముని తత్త్వమును మిథిలయే మొదట వ్యాఖ్యానించినది.

మూడు నగరాల్లో అయోధ్యను రెండవదానిగా లెక్కించినా అది రామ జీవితానికి ప్రధాన రంగం. ఆ నగరానికి ఏలిక దశరథుడు. దశేంద్రియాలను ఆవరించిన మనోరథానికి ఆయన ప్రతీక. ఆయన కెన్ని సంపదలున్నా సంతానం లేదు. దానికొరకు ఆయన పడని పాటులేదు; పట్టని వ్రతంలేదు. దశరథునికి ముగ్గురు భార్యలు, వారు కౌసల్య, సుమిత్ర, కైక. వారు త్రిగుణాలకు ప్రతీకలు. కౌసల్య సత్త్వ గుణం, కైక రజోగుణం, సుమిత్ర తమోగుణం. సుమిత్ర కౌసల్యను నీడవలె వర్తించేది. కైక మంథర మాట-లను మన్నించేది. తమోగుణం సత్త్వగుణాన్ని ఆశ్రయిస్తే గౌరవాదరాలు పొందగలుగుతుంది. రజస్సు స్వార్థప్రేరితమైతే ప్రళయాన్ని సృష్టిస్తుంది. సత్త్వగుణంవల్ల సర్వలోక హితం చేకూరుతుంది. ఇట్టి ముగ్గురు భార్యల వలనా దశరథునకు సంతానం కలగలేదు. పురుషయత్నం విఫలమైంది; దైవానుకూల్యంకోసం యత్నం జరిగింది. పుత్రకామేష్టి సంతానలబ్ధికి తగిన ఉపాయమని సచివప్రేరితుడై దశరథుడు సంకల్పించాడు. సవనం సమాహిత సంకల్ప యాగానికి ప్రతీక. దానికి ఫలంగా యజ్ఞకుండంనుండి ప్రాజాపత్య పురుషుడు ఉదయించి పాయసభాండం అందించాడు.

దశరథుని సంకల్పంలో రెండు ప్రయోజనా లున్నాయి. ఒకటి ఇక్ష్వాకువంశం నిలవటం; రెండు కోసలరాజ్యానికి ధర్మప్రభువు ఏర్పడటం. మొదటిది స్వార్థం; రెండవది ప్రజాహితార్థం. ప్రజలు దశరథుని తరువాత ధర్మప్రభు వెవ్వడని ఆర్తిని వహించారు. యజ్ఞముఖాన ఆర్తిని హవిస్సులతో కలిపి దేవతల కందించారు. అనంతమైన ఆర్తి వినవచ్చినప్పుడే భగవంతుడు భూతలంమీద అవతరిస్తాడు.

ఆర్తి భూతలంమీదే కాదు, దేవలోకాల్లో కూడా అప్పుడు అవత-రించి ఉన్నది. రావణ రాక్షస కృత్యాలను దేవతలందరూ బ్రహ్మను ముందుంచుకొని, నారాయణునకు నివేదించుకొన్నారు. నారాయణుడు రావణుని సబాంధవంగా నాశనం చేయటానికి అవతరిస్తానని శపథం చేశాడు. దేవాంశలతో వానరబలం భూతలంమీద నిలిచింది. అయోధ్యకు కిష్కింధ అనుబంధనగరంగా అవతరించింది.

రామావతారానికి రెండు కారణా లున్నాయి. ఒకటి దైవకార్యం, రెండు దశరథకార్యం. వీటిలో మొదటిది ముఖ్యం. రెండవది ఆనుషంగికం. రాముడు సాధించే కార్యాలనుబట్టి దశరథునికి పాయసాన్ని రెండుగా విభజించాలన్న సంకల్పం కలిగింది. మొదటి సగాన్ని కౌసల్య కిచ్చాడాయన; రెండవ సగాన్ని కైక కిచ్చాడు. సుమిత్ర మిగిలి పోయింది -- ఆమెకు కౌసల్య భాగంలో సగం, కైక భాగంలోనూ సగం -- ఇచ్చాడు. కౌసల్యకు రాముడు జనించాడు. ఆమె భాగంలోని సగంవలన సుమిత్రకు లక్ష్మణుడు పుట్టాడు. రామలక్ష్మణు లొక చెక్కలోని ముక్కలు. అందుకే రాముని వదలి లక్ష్మణు డుండలేదు. కైకకు భరతుడు పుట్టాడు. కైక భాగంలోని సగంవలన సుమిత్రకు శత్రుఘ్నుడు కలిగాడు. వీరిరువురు కూడా ఒక చెక్కలోని ముక్కలే; జంటగా తిరిగే అన్నదమ్ములే. ఇక రామ భరతులు ఒక అఖండంలోని రెండు ఖండాలు. వీరిద్దరూ అవతారకార్యాలను పంచుకొనే అన్నదమ్ములు. రాముడు దేవతల కార్యమైన రావణసంహారం చేయాలి ముందు. అందుకు కోసలరాజ్యం అడ్డం కారాదు. అందువలన రామ పట్టాభిషేకం భంగంకాక తప్పదు. అయినా రాముడే రాజుగా ఉండాలి. ఈ విరోధాభాసాన్ని తొలగించి రామవనవాసకాలంలో రామ పాదుకలకు పట్టం కట్టి రాజ్యభారం నిర్వహించి దశరథ మనోరథాన్ని నిర్వహించే రామ ప్రతినిధి భరతుడు. రామ పట్టాభిషేకానంతరం కూడా భరతుడే యువరాజు.

రాముడు ధర్మం; లక్ష్మణుడు శ్రద్ధ; భరతుడు భక్తి; శత్రుఘ్నుడు శక్తి; ధర్మానికి అండ శ్రద్ధ; భక్తికి కవచం శక్తి. ఈ రెండు జంటలలో మొదటిది సాధింపవలసిన కార్యం అసాధ్యమైనది. అందువల్ల వారికి దైవ మంత్రశక్తులు కావాలి. వాటిని వారిరువురికీ సంతరించి పెట్టిన మహర్షి విశ్వామిత్రుడు. కౌశిక యాగరక్షణ ఘట్టంలో రామలక్ష్మణులు భావిరాక్షస విజయ సాధనాలైన శస్త్రాస్త్రాలను, మంత్రశక్తులనూ సాధించటం గమనార్హం. పితృరాజ్య రక్షణైకవ్రతులైన భరత శత్రుఘ్నుల కీ శక్తియుక్తు లవసరం లేదు. రామభక్తియే వారి శక్తి.

రామాయణంలో రాముడు పుట్టింది మొదలు పట్టం కట్టుకొన్నంత వరకూ ఆయన సాధించింది దైవకార్యం. ఆ తరువాత ఉత్తర రామాయు-ణంలో ఆయన నిర్వహించింది దశరథ సంకల్పం. తండ్రివలె రాముడు కూడా పుడమి నేలటానికి పుత్రులను కన్నాడు. వంశకీర్తిని నిలపటానికి దశరథుడు ప్రాణతుల్యుడైన కొడుకును, రాముడు ప్రాణతుల్యయైన వైదేహిని వనముల పాలు చేశారు. పుత్రవంతుడూ, కీర్తిమంతుడూ, ధర్మపాలకుడూ అయిన రాముడు దశరథ మనోరథ పూర్ణ ఫలం. ఆ ఫలం పండిన చేను అయోధ్య.

మూడో నగరం లంక. సంసారమగ్నుడైన జీవుడులాగా సముద్ర గర్భంలో నిలిచి ఉన్నదా నగరం. ఆ నగర పాలకుడు రావణుడు. అతి భయంకరుడు. అతడు దశగ్రీవుడు. అయోధ్యాధిపతి దశరథుడైతే -- లంకాధి పతి దశగ్రీవుడు. గ్రీవం భోగాశకు చిహ్నం. దశేంద్రియాలతో అనుభవించాలని ఆరాటపడే జీవుడు రావణుడు. ఆ ఇచ్ఛయే అతణ్ణి ముల్లోకాలను జయింప చేసింది; దిశాధిపతులచే దాస్యం చేయించుకొన్నది. అనుభవేచ్ఛ అహంకార పూరితమైనది. అహంకారి ముల్లోకాలను జయించినా తన ప్రకృతిని జయించ లేదు. అందువల్లనే అతడు శివధనుస్సు నెత్తలేకపోయాడు; సీతను వశం చేసుకోలేకపోయాడు. రావణుడు రాక్షస ప్రవృత్తి కలవాడు. పరమాత్ముని మెప్పించటానికి తనువులోని పంచభూత ప్రకృతిని తపింపజేయుటం రాక్షస తపస్సుకు ముఖ్య లక్షణం. అలాగే నారాయణుడైన రాముణ్ణి పొందటానికి సీతను తపింపచేశాడు.

దశరథుడు తన ఆర్తితో భగవంతుణ్ణి భూతలానికి దింపాడు. అది సాత్త్వికమైన ఆర్తి. దశకంఠుడు అహంకారి కావటంచేత తాను ఆర్తిని ప్రకటించడు; సీతయం దార్తిని సృష్టిస్తాడు. ఆ రాముడు లంకకు వస్తాడని ఆ జీవుని తపన. ఉద్ధతుడైన రావణుని గూఢాహంకార వైరభక్తి ప్రవృత్తి విశేషమది.

సీతను దశకంఠుడు చెరపట్టి తెచ్చి అశోకవనంలో ఉంచుతాడు. తననుగూర్చి ఘనంగా చెప్పుకొని తనను స్వీకరింపుమని అడుగుతాడు. పరిచారికలచేత ప్రబోధం చేయిస్తాడు. ఫలితం లేదని తెలిసి సమయం

కొరకు నిరీక్షిస్తాడు. సీతను కామించిన రావణుడు ఆమెను బలాత్కారం చేయలేదు. చేయలేడుకూడా. సీతాసౌముఖ్యం లేకపోతే అతని తల వేయి వ్రక్కలౌతుంది. అందువల్ల ఆమె సౌముఖ్యాన్ని కోరతాడు. ఆమె వశమైతే ప్రకృతిని జయించిన పురుషుడౌతాడు. ఆమె వశం కాకపోతే ఆమెను రాముడే రక్షించుకుంటాడు. తాను ప్రకృతిని జయించలేనినాడు, పరమాత్మ సాన్నిధ్యం పొందటానికి సీత కారణమౌతుంది. ఆ పని భక్తితోచేస్తే భగవంతుడు రక్షిస్తాడు. అదే అహంకారంతో చేస్తే తగినట్లు శిక్షిస్తాడు. ఆ శిక్ష అహంకారానికి ఆధారమైన అతని శరీరాన్ని కూల్చటం. మరణం అతని దైహికానుభవేచ్ఛకు సమాప్తి; అతని జీవుని వేదన అతని ముక్తికి సాధనం. రాముని చేతిలో చావు రావణుని కెంత శిక్షయో అంత వరం. వైరభక్తిలో శిక్షయే వరంగా మారుతుంది. వైరభక్తి మార్గంలో రాముణ్ణి పొందే ప్రవృత్తికి లంక ప్రతీక.

రామాయణ మొక దర్శనం. ఎవరి దృష్టి ఎలా ప్రసరిస్తే అది అలా ప్రత్యక్షమౌతుంది. శ్రీ ఇలపావులూరివారి దర్శన మీ గ్రంథం; రామకథా నవనీతం.

డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం

# రామాయణ పరమార్థం

## అనుక్రమణిక


| | | | పుట |
|---|---|---|---|
| 1. | అవతారిక | ... | 1 |
| 2. | అంతరార్థం | ... | 4 |
| 3. | అనుబంధం | ... | 9 |
| 4. | సమన్వయం | ... | 18 |
| 5. | సంచారం | ... | 27 |
| 6. | సందర్శనం | ... | 37 |
| 7. | విజయం | ... | 43 |
| 8. | వినయం | ... | 46 |
| 9. | భరతవాక్యం | ... | 49 |

# అవతారిక

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే,
సహస్ర నామ తత్తుల్యం రామనామ వరాననే.

శ్రీరామచంద్రమూర్తి కళంకములేని కళానిధి. రామనామం కమ్మని కర్ణ రసాయనం. రామాయణం పరమరమణీయమైన అక్షరనీరాజనం. రామ తత్త్వం, రామ నామం, రామ చరితం - ఈ మూడింటిని మేళవించి ముక్కంటి తన మగువకు 'శ్రీరామ రామ రామ' - అనే తిరుమంత్రం ఉపదేశించినట్టు తోస్తుంది. శ్రీరామ రామ రామ - అని శ్రీయుక్తంగా రామ నామాన్ని మూడుసార్లు స్మరిస్తే చాలట! వెయ్యి నామాలతో వేవెలుగుల వేల్పును ధ్యానించినట్టవుతుందట! రామశబ్దానికి ఇంతటి రమణీయత, మహనీయత, కమనీయత ఎలా వచ్చిందో పూర్తిగా అవగాహనం చేసుకోవాలంటే రామకథను, రామతత్త్వాన్ని భక్తితో, ఆసక్తితో పరిశీలించాలి.

ఇలా రామభద్రుని శీల, శక్తి, సౌందర్యాలను త్రికరణశుద్ధితో భావించి సేవించి తరించిన తపోధనులలో త్యాగయ్య, తులసీదాసు, కబీరు లాంటి మహనీయు లనేకులున్నారు. 'రామనామమే మేలు, రామచింతనే చాలు' -- అని త్యాగయ్య చిన్నచిన్న మాటల్లో చిరంతన తత్త్వాన్ని చిలుకకు చెప్పినట్టు చెప్పాడు. అలాగే రామచరితమానసాన్ని జన మానసంలో ప్రతిబింబింపజేసిన గోస్వామి తులసీదాసు రామచరిత్ర ఒక్క అయోధ్యను ఉద్ధరిస్తే రామనామం ప్రపంచాన్నంతా తరింపజేసిందని నామ మహిమను కొనియాడాడు. ప్రపంచమంతా దశరథనందనుడని రామచంద్రుని కీర్తిస్తే రామనామంలోని పరమరహస్యాన్ని తాను ఊహించుకొని ఉప్పొంగి పోతున్నానని కబీరు గంభీరంగా గానంచేశాడు. ఆర్తజన బాంధవుడయిన రామమూర్తికి రెండవసాటి దైవమిక లేదని రామదాసు ఢంకా మ్రోగించి ప్రకటించాడు. ఇంతమంది మహానుభావులకు ఇంతటి మధురానుభూతిని ప్రసాదించిన రామభావనకు ఆధారం రామాయణం.

రామాయణం ప్రాచేతసుడయిన వాల్మీకి ప్రపంచానికి ప్రసాదించిన ప్రాగ్భారతి. అక్షరబద్ధమయిన కావ్యజగత్తుకు తొలి వెలుగును చూపిన ఆదికావ్యం రామాయణం. వేదవేద్యుడయిన పరంధాముడు రాముడయి దశరథుని యింట కౌసల్య కడుపుపంటగా ఉదయిస్తే, వేదమే కావ్యంగా ఆదికవి వాల్మీకి నోట పలికిందని సహృదయులు భావించారు.

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే,
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్ రామాయణాత్మనా.

లోకోత్తరమైన వేదవాఙ్మయాన్ని లోకసమ్మతమైన కావ్యంగా రూపొందించటమే మహర్షివాల్మీకి మనోరథం. దీనికి రామకథకు మించిన ఆలంబనం మరొకటి ఉండదని వాల్మీకి ఊహ. మనోహరమైన ఈ మధురోహకు నారదుని వాక్సారథ్యం లభించింది. వాల్మీకి కేవలం తపస్వి. లోక కల్యాణకరమైన కృతిని సాధించేందుకు తపించి తపించి చివరకు నారదుని నాదసౌందర్యంలో తన రాముని చరితార్థాన్ని సాక్షాత్కరించుకొన్న ధన్యజీవి వాల్మీకి. నారదుడు కేవలం తపస్వి మాత్రమే కాదు. తపస్స్వాధ్యాయ నిరతుడు, వాగ్విదాంవరుడు, మునిపుంగవుడు. తపస్సుతోపాటు స్వాధ్యాయం, వాక్సంపద, గాంభీర్యం - మూడూ కూడిన మేధావి నారదుడు. వాల్మీకి నారదులు కలసి తలపోసిన ఇతివృత్తానికి బ్రహ్మదేవుని ఆశీర్వచనంకూడా లభించింది.

యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే,
తావద్ రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి.

కొండలు నిలకడగా ఉన్నంతవరకు, నదుల్లో నీరు ప్రవహిస్తూ ఉన్నంత వరకు రామాయణకథ సమస్తలోకాల్లో ప్రచరిస్తుందన్నది బ్రహ్మతీర్పు. ఈ తీర్పులో 'రామాయణకథ' అన్న మాటల కూర్పు ముఖ్యంగా గమనించ దగ్గది. ఇది కేవలం రామకథ కాదట. రామాయణ కథ అంటేనే ఈ కథను సమగ్రంగా పేర్కొన్నట్టవుతుందని ఇందులోని అంతరార్థం. కేవలం రామకథ అనేకంటే రామాయణకథ అనటంలో కొంత విశేషమున్నట్టు కూడా దీనినిబట్టి తేలుతుంది. అసలు రామాయణమనే పేరు మనకు చాలా పరిచితం

అవటంవల్ల దానిలోని భావార్థంగాని, పరమార్థంగాని మనం పట్టించుకోము. రామాయణమంటే రామాయణమేనని వదిలేస్తాం. కాని ఇంత చక్కని పేరు వాల్మీకి తన రచనకు ఎందుకు ఎన్నుకున్నాడో, ఇందులో ఎన్ని చిక్కని భావాలు ఉన్నాయో కొంచెం ఓపికతో సూక్ష్మంగా పరిశీలిస్తేనేగాని బోధపడదు. నిజానికి వాల్మీకి రచించిన రామాయణమే రామాయణము. మిగిలినవన్నీ రామకథలు, రామచరిత్రలు. రామాయణమనే పేరు వాల్మీకి రచనకే పూర్తిగా వర్తిస్తుంది.

* * *

# అంతరార్థం

రామాయణమంతా విని రాముడికి సీత ఏం కావాలని అడిగాడట ఎవరో వెర్రి వెంగళప్ప. ఈ సామెత మామూలుగా పెద్దలు, బుద్ధిమంతులు సరససల్లాపాల్లో చమత్కారంగా వాడుకుంటారు. కాని, ఈ ప్రశ్నకు సరియైన సమాధానం తెలిస్తే రామాయణంలోని పరమార్థం కరతలామలక మయినట్టే అనిపిస్తుంది. ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకునే ముందు అసలు రామాయణమంటే ఏమిటో తెలుసుకోవాలి. ఈ రెండు ప్రశ్నలూ రామాయణమంతా సమగ్రంగా చదివిన తర్వాత ఉదయించేవే కావచ్చు. 'రామాయణం' -- అనే పదంలో కథను సూచించే మాట ఏమీ లేదు. ఇందులో రెండు మాటలున్నాయి - రామ, అయనం. రామ శబ్దంలో రకారం ఉన్నందువల్ల అయనంలోని 'న' 'ణ' గా మారి రామాయణం అయింది. అంటే 'రామాయణం' అనేది రామ, అయనం అనే రెండు మాటలతో ఏర్పడిన సమాసం అని స్పష్టమవుతుంది. రామునియొక్క అయనం అని దీనికి అర్థం చెప్పుకుంటే ఇది షష్ఠీతత్పురుష సమాసం అవుతుంది. సమాసం కనుక మధ్యనున్న విభక్తి ప్రత్యయం లోపించింది.

విభక్తులన్నింటిలో, షష్ఠీవిభక్తికి ఒక ప్రత్యేకత ఉంది. అన్ని విభక్తులూ సామాన్యంగా కర్తృత్వం వహించగల నామవాచకాలకు క్రియలతో సంబంధం కూర్చుతూ ఉంటాయి. అతనితో, అతనివల్ల, అతనియందు లాంటి విభక్తులన్నీ ఈ కోవకు చెందినవే. కాని, షష్ఠీ విభక్తి ప్రత్యయం (యొక్క) - రెండు నామవాచకాలకు గల సంబంధం మాత్రమే చెపుతుంది. క్రియతో దీనికి సంబంధం లేదు. స్వతంత్రంగా కర్తృత్వాన్నిగాని, భోక్తృత్వాన్నిగాని సమర్థించగల రెండు నామ రూపాలకు అవినాభావ సంబంధాన్ని కూర్చటమే షష్ఠీవిభక్తి సాధించే ప్రత్యయ పరమార్థం. ఇలాంటి విభక్తితో ఏర్పడిన తత్పురుష సమాసం రామాయణం. ఇలా వ్యాకరణ పరిభాషను రామాయణభాషకు వర్తింపజేసుకొని చూస్తే రామాయణం అనే సమాసం రామ శబ్దాన్ని అయనంతో అన్వయింపజేసే సమర్థపదవిధి అని తేలుతుంది.

రామ శబ్దం 'రమ్' అనే ధాతువునుండి ఏర్పడింది. 'రమ్' అంటే రమించుట, ఆనందపడుట, ఆనందపెట్టుట, హాయిని గొల్పుట అని అర్థం. 'అయన' శబ్దం 'ఇ' అనే ధాతువు (కదలుట, నడచుట, పయనించుట) నుండి నిష్పన్నమయింది. కనుక రామాయణమంటే రాముని చలనం, గమనం, స్పందనం అని అర్థం. ఉత్తరాయణం, దక్షిణాయనం అనే మాటల్లో అయనం ఈ అర్థంలోనే వాడుతున్నాం. కాబట్టి రామాయణం కేవలం రాముని కథ కాదనీ, అది రాముని అయనాన్ని సూచిస్తుందని తేలింది. రామ శబ్దంలోని రమణీయతకు అయనశబ్దం కమనీయమైన గమనాన్నీ, వేగాన్నీ జోడిస్తుంది. కాగా రామాయణం ప్రపంచంలోని రెండువిధాల భౌతిక శక్తుల -- స్థితిజ (Potential), గతిజ (Kinetic) -- సమ్మేళన మని కూడా స్ఫురిస్తుంది. తదేజతి, తన్నైజతి -- అది చలిస్తుంది, చలించదు అనే ఉపనిషత్సూక్తి రామాయణశబ్దంలో ధ్వనిస్తుంది. నిజానికి రాముడు పుట్టింది మొదలు పట్టాభిషేకంవరకు ఆయన జీవితంలో ఈ అయనత్వం, నిరంతర, నిర్విరామ నియమనిష్ఠ కనిపిస్తుంది. వాల్మీకి రామ జననాన్ని వర్ణించగానే అదే సర్గలో విశ్వామిత్రుని ఆగమనాన్ని సూచిస్తాడు. పదహారేండ్లు కూడా నిండని పసివయస్సులో క్రూరరాక్షస సంహారం, యాగ సంరక్షణం, అహల్యా శాపవిమోచనం, ధనుర్భంగం, సీతాస్వయంవరం, పెండ్లిచేసుకొని రాగానే అడవులకు పయనం, నానాబాధలు, మహర్షుల మన్ననలు, నెలకో నెలవు. చివరకు పర్ణశాల అంటూ ఒకటి ఏర్పడితే కలలోకూడా ఊహించని దారుణం సీతాపహరణం. అప్పటినుండి సీతాన్వేషణం, లంకాయాత్ర, సేతుబంధనం, రావణ సంహారం ఇలా ఒక్క క్షణంకూడా జీవితంలో స్థాయి, హాయి లేకుండా పడరాని పాట్లు పడుతూ సత్య ధర్మాలను మాత్రం వదలకుండా సాగిన రాముని జీవితయాత్ర ఒక గొప్ప అయనం. అదే రామాయణం. ఇంతటి సంచలనం, సంక్షోభం జరుగుతున్నా రాముడు చలించడు. హిమవంతునిలా ధైర్యంగా నిలబడి అన్నింటినీ సమర్థించుకుంటాడు. ఇదే రామాయణంలోని రమణీయత.

ఈ రామాయణ మహాయనంలో సీతారాములు సమాన భాగస్వాములు. రామాయణమనే పేరులోనే ఈ రహస్యం ఇమిడి ఉంది. రామా-

యణం కేవలం రాముని అయనమే కాదు. రామ(సీత)యొక్క అయనం కూడా అందులో ఉంది. రామస్య అయనం, రామాయాః అయనం అని రెండు విధాలుగా రామాయణ శబ్దాన్ని విడదీసి చెప్పుకోవచ్చు. రామ + అయనం రామా+అయనం రామాయణమే అవుతుంది. ఇదే రామాయణ శబ్దంలోని చమత్కారం. వాల్మీకి తన రచనకు పెట్టుకున్న పేరులోని పరమరహస్యం కూడా ఇదే.

కాని, సీతాదేవిని 'రామ' అని వ్యవహరించటం లోకంలో అంతప్రచా-రంలో లేదని కొందరు అభిప్రాయపడవచ్చు. కాని, వాల్మీకి రామాయణంలో అనేక సందర్భాల్లో రామా శబ్దం కనిపిస్తుంది. ఉదాహరణకు అప్పుడప్పుడే అడవుల్లో ఆడుతూ పాడుతూ తిరుగుతున్న సీతాదేవిని గురించి దశరథ మహారాజుకు చెబుతున్న సుమంత్రుడు అన్నమాట లివి:

బాలేవ రమతే సీతా బాలచంద్ర నిభాననా,
రామా రామే హ్యదీనాత్మా విజనేఽపి వనే సతీ.

బాలచంద్రునివంటి ముఖముతో శోభిల్లుతున్న సీతమ్మ పసిపిల్లలా (బాలా త్రిపుర సుందరిలా) మహారణ్యాన్ని కూడా మధువనంగా భావించి విహరిస్తూ ఉన్నదట. ఆమెకు ఇంత గుండెనిబ్బరం, సంతోషం ఎక్కడినుంచి వచ్చాయో! చెంతనున్న శ్రీరామచంద్రుడని వేరే చెప్పాలా? 'రామ పక్కన రాముదుంటే దిగులెందుకు' అంటాడు వాక్యవిశారదుడైన వాల్మీకి. ఇక్కడ రామశబ్దం రామాశబ్దం వెంట వెంటనే జంటగా కనిపిస్తాయి. అందులోకూడా రామ, తర్వాత రాముడు. నిజానికి 'రామారామయో రయనం రామాయణం' (రామా రాముల అయనమే రామాయణం) అని చెప్పటంలో తప్పులేదు.

"రామా యన చపలాక్షుల పేరు, రామ యన బ్రహ్మమునకు పేరు" అన్న త్యాగయ్య కీర్తనలో కూడా రామా శబ్దం అందమైన స్త్రీ అనే అర్థంలో వాడటం గమనించవచ్చు. సర్వాంగ సుందరియైన సీతాదేవిని రామాభిధానంతో వ్యవహరించటంలో పొరబాటేమీ లేదు. సీతాదేవికి రామ చంద్రునికి పేరులోనే కాదు, తీరులోకూడా సామ్యముంది. హనుమంతుడు

లంకనంతా గాలించి చివరకు అశోకవనంలో సీతాదేవి రూపలావణ్యం చూచి నివ్వెరపోతాడు. ఆమె అతిలోక సుందరి అయినందుకు కాదు; ఆమె అంగాంగసౌష్ఠవంలో మూడు మూర్తులా రామచంద్రమూర్తి మొక్కట్లు మూసపోసినట్టు కనిపించటంవల్ల. ప్రపంచంలో సామాన్యంగా తల్లి పిల్లలు, తండ్రి బిడ్డలు, అన్నదమ్ములు, అక్క చెల్లెండ్లు, మేనమామ బిడ్డలు మేనత్తల పిల్లలు ఒక రూపున ఉండుట సహజం. కాని, భార్యా భర్తలు ఒకే రూపున ఉండటం అరుదు. అయినా, సీతారాములది అయిన సంబంధం కూడా కాదేమో! అక్కడ రామయ్యను చూచి ఇక్కడ సీతమ్మను చూస్తే అతడే స్త్రీరూపంలో ఇక్కడ ఉన్నట్టు గమనించిన ఆంజనేయస్వామి మనస్సులో అనుకుంటాడు:

> అస్యా దేవ్యా యథారూపం - అంగప్రత్యంగ సౌష్ఠవమ్,
> రామస్య చ యథారూపం తస్యేయ మసితేక్షణా.

(అన్నీ అవే పోలికలు, ఏ అవయవం చూచినా ఆ రూపానికి ఇది ప్రతిరూపం అన్నట్టుగా ఉంది.)

ఇది ఎలా సాధ్య మయింది? ఇదే రామాయణంలోని అద్వైత రససిద్ధి. సీతారాములకు రూపంలోనే కాదు, గుణగణాల్లో, ఆలోచనల్లో, ఆనందంలో, ఆవేదనలో -- దేనిలోకూడా వ్యత్యాసం లేదు.

> అస్యా దేవ్యా మనస్తస్మిన్,
> తస్య చాస్యాం ప్రతిష్ఠితమ్.

(ఆమె మనస్సు ఆయనలో లీనమయినట్టుగానే ఆయన మనస్సే ఆమె మనస్సులో లయించి ఉన్నదట.)

ఇలా ఒకరి కొకరు బింబ ప్రతిబింబంగా ఉన్న సీతారాముల ఆత్మ మనశ్శరీర సామరస్యాన్ని చూచి హనుమంతుడు స్తంభించిపోతాడు. అలాంటి మనఃస్థితిలో హనుమంతుడిలాంటి బుద్ధిమంతుడే అనుకొని ఉంటాడు -- రాముడికి సీత ఏమవుతుందని! ఇక మనలాంటి పామరులు ప్రశ్నించ-టంలో పొరబాటు లేదేమో! సీతారాములకు మధ్యగల ఈ అన్యోన్యతను,

అభిన్నతను, అనుబంధాన్ని అక్షరరూపంలో నిరూపించటమే 'రామాయణ' పరమావధి. శ్రీరాముడు పరమాత్మ స్వరూపుడయితే సీతాదేవి పరమాత్మ యందలి పరమ కళ. ఈ కళ ముల్లోకాలకుకూడా మూలాధారాన్ని ప్రసాదిస్తుంది.

రాజ్యం వా త్రిషు లోకేషు సీతా వా జనకాత్మజా,
త్రైలోక్య రాజ్యం సకలం సీతాయా నాప్నుయాత్ కలామ్.

* * *

# అనుబంధం

సామాన్య దృష్టికి సీతారాములు భార్యాభర్తలే. సీతారాములను ఆదర్శ దంపతులుగా భావించి ఆరాధించటం ఆధ్యాత్మిక భావనాపరులలో అనూచానంగా వస్తున్న ఆచారం. నూతన వధూవరులను సీతారాములకు ప్రతిరూపాలుగా ఊహించుకొని పెండ్లిండ్లలో రామాయణానికి సంబంధించిన పాటలు సరదాగా పాడుకొనటంకూడా పరిపాటి. "ఆనంద మానంద మాయెనే, మన రాముడు పెండ్లికొడుకాయెనే, మన సీతమ్మ పెండ్లి కూతురాయెనే" అని పారవశ్యంతో పాడుకునే తల్లిదండ్రు లెందరో ఉన్నారు. ఈనాటికీ పల్లెటూళ్ళలో సమర్తపాటలు, వేవిళ్ళపాటలు, మేజువాణీ పాటలు -- అన్నీ సీతారాముల పరంగానే సాగుతున్నాయి. ఇలా జన సామాన్య జీవితంలో చోటుచేసుకున్న సీతారాముల దాంపత్యం మహర్షులకూ, మహాత్ములకు కూడా ఆరాధ్యమయింది. దీనినిబట్టి సీతారాముల ప్రేమానుబంధం క్షణభంగురమైన పార్థివ భావానుబంధం కాదనీ, ఇందులో ఏదో సనాతన సూత్రం పరమ పురాతన తత్త్వాన్ని నిత్య నూతన చైతన్యంతో సమీకరించి లోకకల్యాణకరమైన శాశ్వత సామరస్యాన్ని సాధిస్తున్నట్టు గోచరిస్తుంది. సీతారాముల అభేదం దీనికి పునాది. ఇద్దరిలో సమానంగా పరిపక్వత చెందిన శీల, శక్తి, సౌందర్యాలు దీనికి నిదర్శనలు.

రాముడు నయనాభిరాముడే కాదు, సుగుణాభిరాముడు కూడాను. రూపానికి అనురూపమయిన గుణసంపద, గుణగణాలకు అనుగుణ మయిన నిర్వక్ర పరాక్రమం, రామచంద్రుని లోకాభిరామునిగా రూపొందించాయి. ప్రపంచంలో అందరికీ ప్రియదర్శను డెవరని వాల్మీకి అడిగిన ప్రశ్నకు చందమామలా చల్లని చూపుల నల్లనయ్య రామయ్య అని నారదుడు సమాధానం చెపుతాడు. అన్ని అవయువాలూ సరియైన పాళ్ళలో తీర్చిదిద్దినట్టు అమరిన అంగసౌష్ఠవంతో వెన్నముద్దలా నిగనిగలాడే లోకోత్తర లావణ్యమూర్తి శ్రీరామచంద్రమూర్తి పురుషులను సహితం ముగ్ధులను చేయటంలో ఆశ్చర్యం లేదు. ఈ దివ్యమూర్తిని కన్నందుకు కౌసల్య పొంగిపోతుంది. దశరథుడు తన కన్నతండ్రిని చూడకుండా క్షణం జీవించలేదు. అడవులకు

తరలి వెళ్ళిన రాముడివైపు చూస్తూ చూస్తూనే దశరథుడు తన చూపును కోల్పోయాడు. రామునితోపాటు ఆయన చూపుకూడా అడవులపాలయి పోయిందని కౌసల్యతో అంటాడు. పట్టాభిషేకంకోసం మంగళాలంకరణ చేసుకున్న రాముడు అయోధ్య వీథుల్లో వెళ్ళుతూ ఉంటే ఆ దృశ్యాన్ని చూచిన వాళ్ళు చూచినట్టు నిలబడిపోతారు. ఆ సమయంలో రాముణ్ణి చూడని వాళ్ళు, రాముని దృష్టి సోకనివాళ్ళు దురదృష్టవంతు లంటాడు వాల్మీకి:

> యశ్చ రామం న పశ్యేత్తు యం చ రామో న పశ్యతి,
> నిందితః సర్వలోకేషు స్వాత్మాప్యేనం విగర్హతే.

కాని, రామచంద్రుని రూప లావణ్యాన్ని వర్ణించినంతగా వాల్మీకి అమ్మ వారి అందచందాలను వర్ణించకపోవటం గమనించదగిన విషయం. వివాహ సమయంలో ఏదో శాస్త్రీయంగా ముక్తసరిగా కల్యాణం జరిపిస్తాడే కాని, వధూవరుల సౌందర్యాన్ని గురించికాని, పెండ్లి వేడుకలను గురించికాని, ఆ తర్వాత వారి ప్రణయలీలలను గురించికాని వాల్మీకి పట్టించుకోలేదు. తర్వాత వెలసిన రామాయణాల్లో ఇలాంటి వర్ణనలు కోకొల్లలుగా కనిపి-స్తాయి. అసలు వాల్మీకి రామాయణంలో సీతాకల్యాణం తలవని తలంపుగా తటస్థించిన ఆనందపర్వం. పిల్లలకు పెండ్లిచేస్తే బాగుండునని దశరథుడు అనుకుంటూ ఉండే సమయంలో విశ్వామిత్రుడు ప్రవేశిస్తాడు. సీతారాముల వివాహమైన మరునాడే విశ్వామిత్రుడు ఉత్తరగిరికి బయలుదేరి వెళ్ళుతాడు. ఆ తర్వాత విశ్వామిత్రుని ప్రసక్తి రాదు. దీనినిబట్టి సీతారాముల కలయికకు, విశ్వామిత్రుని యాగసంరక్షణకు ఏదో అలౌకికమైన సంబంధం ఉన్నట్టు తోస్తుంది. యాగం అనే నెపంతో ఆయన రామకార్యార్థమై వచ్చాడని కుల పురోహితుడు వసిష్ఠుడు దశరథునికి సూచనగా ఈ విషయం చెపుతాడు. ఈ రహస్యాన్ని తనంతట తాను విప్పిచెప్పటం ఇష్టం లేకనే విశ్వామిత్రుడు దశరథునితో అంటాడు-- మీ కుమారుడు ఎంతటి మహనీయుడో నాకు తెలుసు. అతనిలో దాగియున్న సత్య పరాక్రమాన్ని మీ వాత్సల్యం అవగా-హనం చేసుకోలేకుండా ఉన్నది. కావాలంటే వసిష్ఠుణ్ణి అడుగు. మరో తపస్సంపన్నుణ్ణయినా అడుగు. వాళ్ళకు తెలుసు.

అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్,
వసిష్ఠశ్చాపి ధర్మాత్మా యేచేమే తపసి స్థితాః.

సీతారాముల కల్యాణమే విశ్వామిత్రుని ధ్యేయం. మధ్యలో యాగ సంరక్షణ, రాక్షస వధ, అహల్యా శాప విమోచనం అన్నీ ఈ పరమ కల్యాణ సంరంభానికి హంగులు. తమోగుణ ప్రధానమైన తాటకను సంహరించి, రజోలీనయై అదృశ్యగా నున్న అహల్యను ఆవిష్కరించి, నిత్య సత్య సందీప్తమైన సాత్త్విక తేజస్సుతో అయోనిజగా జనకుని వాత్సల్యంతో పెరుగుతున్న జానకిని చేపట్టటమే రామభద్రుడు విశ్వామిత్రుని సాహచర్యంలో సాధించిన సత్త్వసిద్ధి. విశ్వామిత్రుడు గాయత్రీ మంత్రద్రష్ట. రామాయణం గాయత్రీ బీజ సంహిత. ఇరవైనాలుగువేల శ్లోకాల్లో వేదమాతను బీజరూపంగా ప్రతిబింబింపజేసిన వాల్మీకి రచనకు మూలాధారం విశ్వామిత్రపాత్ర. ఈ మహర్షి సాధించిన సీతారామ సమాగమం సీతా సమేత మయిన రాముని అయనానికి మొదటి మెట్టు. ఈ సమాగమంలోని రహస్యం దీనికి గల ప్రాశస్త్యం జనకుడు పాణిగ్రహణ సందర్భంలో సూత్రప్రాయంగా సూచిస్తాడు. రామభద్రునికి సీతను అప్పగిస్తూ ఆ రాజర్షి అన్న మాటలు మంత్రభావంతో మననం చేయదగ్గవి.

ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ,
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా.

"ఇదుగో మా అమ్మాయి సీత. నీకు ధర్మకార్య నిర్వహణలో సహచరిగా ఉపకరిస్తుంది. ఈమెను చేరదీస్తే నీకు శుభం చేకూరుతుంది. ఈమెకు చేయూత నిచ్చి చేదోడు వాదోడుగా ఇద్దరూ జీవితం సాగించండి." ఇదీ జనకుని సందేశ సారం. ఇందులో రామాయణ మహాయనమంతా సూక్ష్మంగా గోచరిస్తుంది. వాల్మీకి వర్ణించిన సీతాకల్యాణ ఘట్టానికి ప్రాణప్రాయ మయినది ఈ శ్లోకం. ఈ శ్లోకంలోని మొదటి పంక్తిలో ఇయం (ఈమె), మమ(నా), తవ(నీ) మూడు సర్వనామాలు ఉన్నాయి. ఇవి కేవలం సీత, జనకుడు, రాముడికే కాక జీవధానిలోని జీవధారుల కందరికీ వర్తించే సర్వనామాలు. మా అమ్మాయి సీత. మా ఇంట్లో పెరిగి మీ

యింటికి వెళ్ళుతున్నది. ఎందుకు? ధర్మం నిలబెట్టేందుకు. ఈమె యందు నీకు పరిపూర్ణమైన అనురాగం (ఇచ్ఛ) ఉంటే నీకు శుభమవుతుంది. ఎన్ని చిక్కులు వచ్చినా, ఎన్ని ఆపదలు ముంచుకు వచ్చినా మీ యిరువురి మధ్య ఈ యిచ్ఛాశక్తి దృఢంగా ఉంటే మీకేమీ అపాయం లేదు. ఇచ్ఛకు, ప్రతీచ్ఛకు మధ్య చిన్న పెద్దలు, హెచ్చు తగ్గులు, హాని వృద్ధులు ఉండేందుకు అవకాశంలేదు. సమరసభావం సహచరుల జీవితానికి సంతోషం, సార్థక్యం, సమకూర్చ గలుగుతుంది". సాక్షాత్ పరమేశ్వరి తన ఇంట పెరిగినందుకు, అలాంటి సీతమ్మను పరమేష్ఠి స్వరూపుడైన రాముని చేతుల్లో పెడుతూ జనకుడు ఎంతగా ఏ దిక్కున పొంగిపోయి ఉంటాడో 'మమ సుతా' అనే చిన్నవాక్యం చెపుతుంది. 'ఇయం సీతా' అనటంలో సీతాదేవి పుట్టుపూర్వోత్తరాలు, 'తవ' అనే మాటలో దశరథనందనుని ఘనత వెయ్యి విధాల వ్యక్తమవుతున్నట్టు భావించాలి.

మరి ఈ లోకోత్తరభావ భూమికలో పార్థివమైన సౌందర్యానికి, సంతో-షానికి తావు లేదు. అది మహానంద నిలయం. సీతారాముల అద్వైత రససిద్ధికి ఆధారభూతమైన జీవధార. మట్టిలో పుట్టి మట్టిలో లయమైన జానకి జీవితమంతా ఈ జీవధారకే అంకిత మయింది. సూర్యవంశంలో ప్రభవించిన శ్రీరామచంద్రమూర్తి వెలుగులకు వెలుగును ప్రసాదించగలిగిన వేవెలుగైతే, భూసారంనుండి ప్రభవించిన సీతాదేవి ఆ వెలుగులో వెలసిన వెలలేని వేల్పు. ఆకాశం శూన్యం. ధరణి పరిపూర్ణం. శూన్యాన్ని పూర్ణంతో సమీకరించే సుందర సన్నివేశం సీతారామ సమాగమం.

సీతను చేపట్టేందుకు అప్రాకృతమైన పరాక్రమం కావాలి. వీరాధి-వీరులకు సాధ్యంకాని శివధనుర్భంగం చేయగలిగితేనే కాని సీత లభించదు. ఈ పరీక్షలో రాముడు అవలీలగా నెగ్గుతాడు. 'అబ్బాయీ రామా! ఈ విల్లును చూడు' (వత్స రామ-ధనుః పశ్య) అని విశ్వామిత్రుడు అన్నాడో లేదో రాముడు విల్లు చేపట్టాడు, ఫెళ్ళున విరిగింది. ముని కనుసైగ తెలిసి శివధనువును విరిచిన సమయమున, రాముడికి ఏ మాత్రం అలసట అనిపించలేదట. ఆయన ముంగురులు (అలకలు)మాత్రం ముచ్చటగా

ముడి పడ్డాయట(అల్లల్లాడాయట). ఒకవేళ రాముడికి తెలియకుండానే ధనుస్సు విరిగిందేమో అనిపిస్తుంది. ముందు ముందు జరుగనున్న మహత్తర కార్యసాధనకు ఇది మచ్చుతునకగా తోస్తుంది. ధనుర్భంగం కారణం, కల్యాణం కార్యం; శక్తి కారణం, భక్తి కార్యం. సీతారాముల కలయికలో శక్తి భక్తితో మేళవించి రక్తిగట్టిస్తుంది. రామాయణం మొదటినుంచి చివరవరకు శక్తినో, భక్తినో, రక్తినో ప్రసరింపజేస్తూ ఉంటుంది. అద్భుతమైన శక్తి, అచంచలమైన భక్తి, ఆహ్లాదకరమైన రక్తి రామాయణంలోని గుణత్రయి. ఈ గుణత్రయిని సాధించేందుకే సీతారాములు తమ దాంపత్య జీవితాన్ని ధారపోశారు.

కాని, నిజమైన ప్రేమకు నికష లెక్కువ. నిప్పు చూపితేనే గాని బంగారం నిగనిగలాడదు. సీతారాముల దాంపత్యంకూడా అంతే. వనవాసం రాముడికేగాని సీతకు విధించలేదు. కాని తనంతట తాను బలవంతంగా భర్తను బతిమలాడి ఒప్పించి తానుకూడా అడవికి బయలుదేరింది. పతిపరాయణయైన సతి రామరహితమైన అయోధ్యకంటె రామసహితమైన అరణ్యమే మేలనుకొని రామునివెంట వెళ్ళిననూ చివరకు రామవిరహం తప్పలేదు. రామవిరహంలోనే రామపత్నికి రామతత్త్వం, రామసౌందర్యం బాగా బోధపడి ఉంటాయి. కంటిరెప్పలవలె రామలక్ష్మణులు కాపాడుతూ ఉన్నంతవరకు దండకారణ్యం కూడా నందనవనంలా ఆనంద సంధాయకమే అయింది. అలాంటిది రామసందర్శనమే దుర్లభమయ్యే సరికి దివ్యచక్షువులతో రాముని దర్శించే దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు ధన్యులు గదా అని తల్లి విలపిస్తుంది. రామసందేశం తీసుకొని వచ్చిన హనుమంతుని చూచేసరికి ఆమె ప్రాణాలు లేచివస్తాయి. అశోకవనంలో శోకాకులమైన హృదయాంతరంలో తిరిగి ఆశాలోకం ప్రవేశిస్తుంది. రామనామాంకితమైన ముద్రికను చూచుకొని ఆమె ఊరడిల్లుతుంది. మరుక్షణమే దిగులు పొంగివస్తుంది. ఇలాంటి మనఃస్థితిలో రామదూత హనుమంతుడు రామే-శ్వరిని దర్శిస్తాడు. అప్పుడు హనుమంతునికి ఆమెలో అతిలోక లావణ్యం గోచరిస్తుంది. ఈమెకోసం ముల్లోకాలు జయించవలసి వచ్చినా జయించి ఈమెను పొందవలసిన అవసరం రామస్వామికి ఉన్నదని రామదూత భావి-

స్తాడు. అంతవరకు సీతాదేవి సౌందర్యాన్ని వర్ణించని వాల్మీకి ఒక్కసారిగా ఆమె సర్వాంగశోభను అష్టోత్తరశత పంక్తులలో వర్ణిస్తాడు. అశోక వాటిక లోని సీతాదేవి నిరలంకృత. ఆభరణాలు లేవు సరికదా, సరిగా జడకూడా వేసుకొనలేదు. నిద్రాహారాలు లేక కృశించి దిగులుతో కుంగిపోతున్న సీతమ్మ ఇంత అందంగా కనిపించటానికి కారణం ఆమె నిశ్చల తపస్సు, హనుమంతుని నిర్మల మనస్సు.

ఇంత దీనావస్థలో ఉన్నప్పటికీ ఆమె చలించదు, జంకదు, జడియదు. సర్వలోక భయంకరుడైన రావణుడు కత్తితీసి బెదరించినా ఆమె అతణ్ణీ, అతని దర్పాన్నీ తృణప్రాయంగా నిరసిస్తుంది. ఈ క్షణంలోనే నిన్ను రామయ్య దగ్గరకు చేరుస్తాను, నా భుజంమీద ఎక్కించుకొని నిన్ను తీసుకువెళతానని హనుమంతుడు సీతాదేవితో చెప్పినప్పుడు ఆమె దానికి అంగీకరించదు. రాముడు లేని సమయంలో దొంగవలె వచ్చి రావణుడు తనను తీసుకొనివచ్చినట్లే, రాముడి దగ్గరికి తాను తప్పించుకొని పోవటం ఆమెకు ఇష్టం లేదు. ఇది తన భర్తకు అపఖ్యాతికరమని ఆమె అభ్యంతరం. ఈ మాటలు వినగానే హనుమంతునికి సీతాతత్త్వం కూలంకషంగా బోధపడుతుంది. ఈమె రామునికి తగిన భార్య అని అతను లోలోన పొంగిపోతాడు.

సీతాదేవి పవిత్రతకు మరో తార్కాణం హనుమంతునికి లంకా దహనంలో లభిస్తుంది. నాలుగంగుళాల స్థలంకూడా మిగలకుండా లంకా పట్టణమంతా దహించుకు పోవటం చూచి హనుమంతుడు సీతమ్మ క్షేమంగా ఉన్నదో లేదో అని తహతహలాడుతాడు. ఇంతలో ఆమె సురక్షితంగా ఉన్నదని అందరూ అనుకుంటుంటే విని ఆనందిస్తాడు. అసలు తనతోకకు అంటుకున్న నిప్పు తనకు ఏమాత్రం అంటని కారణం సీతాదేవి ఆత్మశుద్ధి అనే విషయం కొంచెం ఆలోచిస్తేగాని హనుమకు అర్థం కాదు. అప్పటికి బోధపడుతుంది-- సీత అగ్ని లాంటిదని. అగ్నిని అగ్ని కాల్చలేదు కదా! కాబట్టి కల్యాణ స్వరూపిణి సీత నశించేందుకు వీలులేదని (న నశిష్యతి కల్యాణీ, నాగ్ని గగ్నౌ ప్రవర్తతే) రూఢిపరుచుకుంటాడు.

ఇంతకు మించిన అగ్నిపరీక్ష యుద్ధానంతరం జరుగుతుంది. తనలోని తపశ్శక్తిని గుర్తించక తనను సామాన్యభామినిగా భావించి తనభర్త అనరాని మాట లన్నప్పుడు ఈ అవమానం కంటె అగ్ని ప్రవేశమే శ్రేయస్కరమని సీతాదేవి, లక్ష్మణుడు పేర్చిన చితిలో నిర్భయంగా ప్రవేశిస్తుంది.

యథా మే హృదయం నిత్యం నాపసర్పతి రాఘవాత్,
తథా లోకస్య సాక్షీ మాం సర్వతః పాతు పావకః.

'నా హృదయంలో రాఘవుడు తప్ప మరొకరు లేకుంటే అగ్ని దీనికి సాక్ష్యం పలికి అన్నివిధాల నన్ను కాపాడుగాక' -- అని అగ్నిలో ప్రవేశించగానే అగ్నిదేవత సీతాదేవిని ఆమె పతిదేవతకు అక్షతంగా అప్పజెప్పి తనకంటె పవిత్రమైన ఆమెను స్వీకరించవలసినదిగా ఆజ్ఞాపిస్తాడు. ఇది అతిలోకమైన అద్భుత సన్నివేశం. పర్ణశాలలో సీత కనిపించనప్పుడు అరణ్యం మారుమ్రోగేట్టు విలపించిన రామచంద్రుడు, తన సీతను తనకు చూపించక పోతే దిక్కులను దగ్ధం చేస్తానని ధిక్కరించిన రణధీరుడు ఇంతమంది రాక్షసులను సంహరించి సీతను చెరనుండి విడిపించింది ఇందుకేనా? అని ఎవరి కయినా అనిపిస్తుంది. వజ్రంకంటె కఠినం, పూలకంటె కోమలమయిన లోకోత్తర పురుషుల హృదయం అర్థం చేసుకొనేందుకు లోకోత్తరమైన దృష్టి అవసరం. రావణ సంహారం కాగానే రాముడు నేరుగా సీతదగ్గరకు వెళ్ళి ఆమెను చేరదీసి ఊరడించవలసిందని సామాన్యులకు అనిపిస్తుంది. కాని, సీతారాములు సామాన్య దంపతులు కారు. వ్యక్తిగత సంక్షేమంకంటె లోక కల్యాణం ప్రధానమని భావించిన ఆదర్శ దంపతులు కాబట్టి ఒకరి నొకరు అర్థంచేసుకోగలిగారు. ఎంత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించినా భర్తమీది గౌరవం, అనురాగం సీతాదేవి మనస్సులో ఏమాత్రం తరగలేదు. చివరకు భూమాత ఒడిలో ఒదిగిపోయే సమయంలో కూడా "మనసా కర్మణా వాచా యథా రామం సమర్చయే, తథా మే మాధవీదేవీ వివరం దాతు మర్హతి" (త్రికరణశుద్ధిగా నేను రామభద్రుని ఆరాధిస్తున్న మాటే నిజమయితే నా చల్లని తల్లి భూదేవి నన్ను తనలో చేర్చుకోవాలి) అని ప్రతిజ్ఞచేసి తన లోకోత్తర పతినిష్ఠను నిరూపించుకుంటుంది -- జగదేకమాత సీత.

రామతత్త్వం సీతాదేవికి తెలిసినట్టు సీతాతత్త్వం రాముడికి తెలుసు. ఇద్దరి అనుబంధం హనుమంతుడికి తెలుసు. కనుకనే సీతారాముల మధ్య వాక్సారథ్యం వహించి ఒకరి హృదయాన్ని ఒకరికి అందించగలిగాడు ఆంజ-నేయుడు. రామనామాంకితమైన ముద్రికను సీతమ్మకు ఇచ్చి ఆమె తలలోని చూడామణిని రామయ్యకు తెచ్చియిచ్చిన భక్తశిఖామణి ఆంజనేయుని తోటి వానరులు సీతావృత్తాంత కోవిదుడని కొనియాడటంలో ఆశ్చర్యం లేదు. సీతమ్మను కౌగిట చేర్చుకున్న రామభద్రుడు హనుమంతునికి కూడా ఆలింగన భాగ్యాన్ని అనుగ్రహిస్తాడు. అలాగే పట్టాభిషేక సమయంలో సీతమ్మ తనమెడలోని ముత్యాలహారాన్ని తీసి హనుమంతుడి కిస్తుంది. రామభద్రుని ఆమోదముద్రకూడా దీనికి లభిస్తుంది. కాబట్టి సీతారాముల ప్రేమానుబంధం రామాయణ మహామాలకు రత్నంలాంటి హనుమంతునికి తెలిసినట్టుగా మరొకరికి తెలియదు.

అలాగే రామావతార రహస్యం సుమిత్రకు తెలిసినట్టు మరొకరికి తెలియదు. కన్నతల్లి కౌసల్యకు కూడా తెలియదు. కొడుకు దూరమయి పోతు-న్నందుకు కుమిలిపోతున్న కౌసల్యకు రామమహిమను వివరిస్తూ సుమిత్ర అంటుంది.

సూర్యస్యాపి భవేత్ సూర్యో హ్యగ్నే రగ్నిః ప్రభోః ప్రభుః,
శ్రియః శ్రీశ్చ భవే దగ్ర్యా కీర్త్యాః కీర్తిః క్షమా క్షమా.

(రాముడు సామాన్యుదు కాదు, సూర్యునికి వెలుగిచ్చే సూర్యుదు, అగ్నిని ప్రజ్వలింపజేసే అగ్ని, ప్రభువులకు ప్రభువు, శ్రీని సశ్రీకంచేసే శ్రీమంతుడు, కీర్తికి కీర్తితెచ్చే కీర్తిమంతుడు, ఓర్పుకు ఓర్పు నేర్పే ఓరుపరి.)

సీతారాముల దివ్యత్వం విశ్వామిత్రుడు, సుమిత్ర, హనుమంతుడు, అనసూయలాంటి కొద్దిమందికి తెలిసినా రాముడు మాత్రం తాను దశరథ మహారాజుకు కొడుకుగా జన్మించిన సామాన్య మానవుణ్ణనే భావిస్తాడు. 'ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజం' అని రాముడు స్పష్టంగా అంటాడు. కాదు కాదని మహర్షులు, దేవతలు, రావణ సంహారం అయిన తర్వాత అగ్నిపరీక్ష కాగానే ముక్తకంఠంతో చెప్తారు. అయితే

తన దివ్యత్వం తనను తాను మానవునిగా భావించుకోవటంలోనే ఉన్నదనే విషయం సత్యపరాక్రముడైన రామునికి తెలుసు.

కాబట్టి, సీతారాముల ప్రేమానుబంధం లౌకికంగా ఆలోచిస్తే పరమ కల్యాణకరమైన లౌకిక రాగానుబంధం. లోకోత్తర దృక్పథంతో పరిశీలించి చూస్తే శరీర మనస్సంబంధాలకు అతీతమైన ఆత్మానుబంధంగా సనాతన సంబంధంగా గోచరిస్తుంది. రాముడు వేదవేద్యుడయితే సీత వేదమాత. రాముడు పరమేష్ఠి అయితే రామపత్ని పరమేశ్వరి. రాముడు అక్షర పరబ్రహ్మ అయితే సీతామాత అక్షర భారతి. రాముడు శివ స్వరూపుడయితే సీత శక్తిస్వరూపిణి. రాముడు పరమాత్మ అయితే సీత పరంజ్యోతి. ఈ పరంజ్యోతిని సాక్షాత్కరించుకొన్న హనుమంతునికి ఈ ప్రేమానుబంధం-లోని పరమార్థం తెలుసు. హనుమంతుని రామదూతగా సీతాతత్వార్థ కోవిదునిగా చిత్రించిన వాల్మీకికి తెలుసు. ఈ సంగతి వీళ్ళిద్దరికి తెలుసని భక్తకవి గోస్వామి తులసీదాసుకు తెలుసు. కనుకనే కవీశ్వర(వాల్మీకి), కపీశ్వరు(హనుమంతుడు)లను కృత్యాదిని స్మరిస్తూ గోస్వామి అంటాడు--

సీతారామగుణగ్రామ పుణ్యారణ్యవిహారిణౌ,
వందే విశుద్ధవిజ్ఞానౌ కవీశ్వర కపీశ్వరౌ.

నిజానికి ఈ 'విశుద్ధ విజ్ఞాన దృష్టితో చూస్తే అంతా రామమయమే. రెండు కనుబొమ్మల నడుమ నున్న పరంజ్యోతిని ధ్యానిస్తూ సాధకుడు ముక్కు చివర చిక్కబట్టిన దృష్టి సీతాదేవిని స్పృష్టిస్తే ఫాలభాగంలో రామ రాజ్యం పదివేల యుగాలను వెలయిస్తుంది. రాముడు సత్య పరాక్రముడైతే సీతాదేవి సహధర్మచారిణిగా ఆయన చెంతనే నెలకొని ఉంటుంది. సత్య ధర్మ సమన్వయమే సీతారాముల రాగానుబంధం.

* * *

# సమన్వయం

ఆడినమాట తప్పకుండుట ఇక్ష్వాకువంశపురాజుల ఆచారం. నారదుడు రాముణ్ణి గురించి వాల్మీకికి చెపుతూ మొట్టమొదట 'ఇక్ష్వాకు వంశ ప్రభవో రామో నామ జనైశ్శ్రుతః'-- అని రాముని వంశాన్ని చెప్పి, ఆ తర్వాత అతని ఖ్యాతినీ, రీతినీ వివరిస్తాడు. రాముని గుణగణాలన్నీ చెప్పి చివరకు 'సత్యే ధర్మ ఇవాపరః' అంటాడు వాక్య విశారదుడయిన నారదుడు.ఇది చాల సారగర్భితమైన మాట. సత్యనిష్ఠలో రాముడు సాక్షాద్ధర్మదేవతగా వ్యవహరిస్తాడట. ఆ తర్వాతి పంక్తిలో 'తమేవం గుణసంపన్నం రామం సత్యపరాక్రమం' అని మళ్ళీ రాముని సత్యపరాక్రమం ప్రసక్తికి వస్తుంది. నారదుడు సూచించిన ఈ రామ సూత్రాన్ని వాల్మీకి చక్కగా గ్రహించి అవకాశం వచ్చినప్పుడల్లా 'రామః సత్యపరాక్రమః', 'సత్య ధర్మ పరాయణః', 'ధర్మజ్ఞః', 'ధర్మిష్ఠః' అని పరిపరి విధాల ఈ సత్య ధర్మ సమన్వయాన్ని మనకు గుర్తుచేస్తుంటాడు. 'రాముడు మూర్తీభవించిన ధర్మదేవత' అని మారీచుడు రావణుణ్ణి మందలిస్తాడు. కాని సత్యానికి, ధర్మానికి షష్ఠాష్టక మయిన మందమతికి ఈ మాటలు బోధపడవు. సత్యపరాక్రమ శబ్దంలో ఎంతో సారముంది. నిజమైన పరాక్రమం కలవాడని దీనికి మామూలుగా అర్థం చెప్పుకోవచ్చు. కాని సత్యమే పరాక్రమంగా కలవాడని కూడా దీనికి అర్థాంతరం ఏర్పడుతుంది. సత్యానికీ, నిజానికీ కొంత వ్యత్యాసముంది. మూడు కాలాలలో నిజమైనదాన్ని సత్యం అని వ్యవహరించటం కద్దు. భూత భవిష్య ద్వర్తమానాలకు వర్తించే శాశ్వత (సనాతన) సత్యమే రాముని పరాక్రమం. ఒక్కొక్కచోట 'సత్య ధర్మ పరాక్రమః' అని కూడా రాముణ్ణి వర్ణించటం జరిగింది. సత్యం, ధర్మం రెండు పాదాలుగా చేసుకొని రామ చంద్రుని అయనం ముందుకు సాగుతుందని దీని పరమార్థం. సామాన్యంగా మనం నడిచేప్పుడు ఒక కాలు నేలకు ఆని ఉంటుంది. మరొక కాలు నేలకు పైన ఉంటుంది. రాముని పరాక్రమం (ముందంజ)లో సత్య, ధర్మాలు ఇలాగే నడుస్తాయి. ఒకప్పుడు సత్యానికి ధర్మం ఆధారమవుతుంది. మరొక ప్పుడు ధర్మానికి సత్యం పునాది అవుతుంది. ఈ రెండింటిని సమన్వయ పరచుకుంటూ సత్యపరాక్రముడు సన్మార్గంలో ముందుకు సాగుతాడు.

అయోధ్యాకాండలో అదుగదుగునా ఈ సత్యధర్మ సమన్వయం గోచరిస్తుంది. ప్రజల మేలు కోరి ప్రజల ఆమోదంతో పెద్దకుమారుడయిన రాముడికి పట్టాభిషేకం చేద్దామని దశరథుడు సంకల్పించాడు. ఇది ధర్మ సమ్మతమైన ఆలోచన. కనుక దీనికి వశిష్ఠుల ఆమోదం లభించింది. మంగళకార్యం ఆరంభమయిన తర్వాత కైక కోరిన రెండు వరాలు అడుగులోనే హంసపాదిని వేశాయి. కైకకు మాట యిచ్చింది నిజం. ఇది కేవలం దశరథుడికే తెలుసు. కాని ఆడిన మాట తప్పటం రఘువంశ మహారాజులకు తెలియదు. సత్యసంధుడయిన దశరథుడు ధర్మ సందేహంలో పడిపోతాడు. దశరథుని మనోరథం ధర్మసమ్మతం. కైక కోరిక సత్యనిష్ఠకు సంబంధించినది. సత్యాన్ని పాలిస్తే ధర్మం కుంటుపడుతుంది. ధర్మం నెగ్గాలంటే సత్యం అసత్య మవుతుంది. "యది సత్యం బ్రవీమ్యేతత్ తదసత్యం భవిష్యతి" అని (నిజం చెప్పాలంటే నిజం అబద్ధమవుతుంది) అని దశరథుడు మథనపడతాడు. ఈ మథనకు మూలకారణం మంథర. చిన్నతనంనుంచి ఈమె కైకకు దాసిగా, సహోషిత(నెచ్చెలి)గా ఉంటూ ఆమె కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ ఉన్నదట. ఉన్నట్టుండి ఆమె రాజభవనం పై అంతస్తు మీదికెక్కి పట్టాభిషేక సంరంభం చూచి పట్టలేక అమాంతం కిందికి దిగి వచ్చిందట. కమలంలాటి కైకమనస్సును ఈర్ష్యతో మలినంచేసి ఒక్కక్షణంలో రఘువంశాన్ని అఘువంశంగా మార్చివేసిన మాత్సర్యవతి మంథర కైక హృదయంలో ప్రవేశించింది. రాజ్యలోభం, పదవీ వ్యామోహం ఎంతటి ఉదారహృదయులను కూడా క్షణంలో రహదారికి లాగ గలవని చెప్పేందుకు మంథర నిదర్శనం. ఈమె కైక జీవితంలో అకస్మాత్తుగా ఆవిర్భవించిన వ్యక్తి కాదు. సహోషిత అనే మాట ఆమె ఉనికిని చక్కగా చిత్రిస్తుంది. ఆమె కైక చెంతనే కూర్చుని ఉన్న ప్రాసీయుసి (పొట్టి మానిముంత). వ్యక్తిలో ఈర్ష్య, వ్యామోహం, లాలస, పట్టుదల ఎక్కడినుంచో రావు. లోపల దాగియున్న భావాలే తరుణం చూచుకొని తొంగిచూస్తాయి. సామాన్యులు వాటికి లొంగిపోతారు. మహనీయులు వాటిని లొంగదీస్తారు. కైక మంథరకు లొంగిపోయింది. సత్యం సాకుతో

ఆమె తన దౌర్బల్యాన్ని బయట పెట్టుకొని పండులాంటి కుటుంబాన్ని పాడుచేసింది. కాని సత్య పరాక్రముడైన రాముడు,-తన కర్తవ్యాన్ని వెంటనే గుర్తించి మంథర నాటిన విషవృక్షాన్ని మందారవనంగా మార్చాడు. సత్య ధర్మాలకు సామరస్యం కూర్చాడు.

పట్టాభిషేక వార్త వినిపించిన రాత్రి వనవాసపు గుసగుసలతో తెల్లవా-రింది. పట్టాభిరాముణ్ణి ఎప్పుడెప్పుడు చూస్తానా అని సూర్యోదయంతో పాటు రామాభ్యుదయం కోసం ఎదురు చూస్తున్న తండ్రి అప్పుడే తెల్లవారిందని భయపడుతున్నాడు. కాని, రాత్రి తన తండ్రి తనను చేరదీసి పట్టాభిషేక వార్త చెప్పినప్పుడు రామచంద్రుని ముఖం ఏలా ఉందో, మర్నాడు కైకమ్మ స్పృహతప్పి పడిపోయిన దశరథుని యెదుట వనవాసం సంగతి రాముడికి తెగించి చెప్పినప్పుడు కూడా అలాగే ఉంది. ఆయన మనస్సు ఏమాత్రం చలించలేదు (శ్రుత్వా న వివ్యథే రామః). ఒక్క క్షణంకూడా ఆలోచించ కుండా 'అలాగే వెళ్తానమ్మా. అడవికి వెళ్ళేందుకు అభ్యంతర మేముంది? ఇదిగో ఇప్పుడే వెళ్తున్నాను' అంటాడు (ఏవమస్తు గమిష్యామి వనం వస్తు మహం త్వితః). నాన్నగారు నీ కీ మాట చెప్పేందుకు జంకి అలా మగతగా పడుకున్నారని కైక అనగానే రాముడు నొచ్చుకొని తన పిన్నమ్మను వెన్నలా కరిగించేమాట అంటాడు:

అనుక్తోఽప్యత్రభవతా భవత్యా వచనాదహమ్,
వనే వత్స్యామి విజనే వర్షాణీహ చతుర్దశ.

(ఆదేమిటమ్మా, అలా అంటావు. ఈ మాట నాన్నగారు చెప్పాలా? నీవు చెప్తే చాలదా? నాన్నగారు చెప్పినా చెప్పకపోయినా నీ మాట మీద నేను పద్నాలుగు సంవత్సరాలు అరణ్యంలో ఆనందంగా గడుపుతాను.)

కాని, కైక మనస్సు కరగదు. భరతుడు వచ్చేలోగా రాముడు అడవికి వెళ్ళకపోతే కథ అడ్డం తిరగవచ్చునని ఖంగారు పడుతున్న కైకమ్మ ముఖవైఖరి చూచి రాముడు తన దృఢసంకల్పాన్ని దృఢతరంగా చెప్తాడు:

నా హమర్థపరో దేవి లోకమావస్తు ముత్సహే,
విద్ధి మాం ఋషిభి స్తుల్యం విమలం ధర్మమాశ్రితమ్.

(నాకు ధన కనక వస్తు వాహనాలపై ఆసక్తిలేదు. నాకు కావలసింది రాజ్యం కాదు, రాష్ట్రం. లోకం నాకోసం ఎదురు చూస్తున్నది. అర్థంతో నాకు పని లేదు. నిర్మలమైన ధర్మనిర్వహణతో ఋషులమధ్య ఋషి జీవితం గడపాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతూ ఉంది.)

ఈ మాటల్లోని రహస్యం కైకకు బోధపడదు. వెంటనే తల్లిదగ్గరకు వెళ్ళుతాడు. తన కొడుకు కొద్ది క్షణాల్లో రాజు కాబోతున్నాడని పొంగి పోతున్న కౌసల్యాదేవి వనవాసవార్త వినగానే విషాదంతో కుంగిపోతుంది. గొడ్డలిపెట్టుకు విరిగిపోయిన చెట్టులా పడిపోతుంది. రాముడు తల్లిని ఓదారుస్తాడు. లక్ష్మణుడు ఆవేశంతో అనరాని మాటలు అంటాడు. తప్పుదారి పట్టిన తండ్రి మాట వినక పోయినా తప్పు లేదంటాడు. పిచ్చి తల్లి కౌసల్యకు లక్ష్మణుడు చేసిన సూచన సమంజసంగానే ఉన్నట్టు తోస్తుంది. కాని, రాముడు దృఢవ్రతుడు. పితృవాక్య పరిపాలన ఒక్కటే తన ధర్మంగా భావించిన బుద్ధిమంతుడు. ధర్మాత్ముడయిన రాముడు, తల్లితో ధర్మ సమ్మ-తమైన మాట అంటాడు-- 'అమ్మా, నాన్న మాట కాదనేంత సామర్థ్యం నాకు లేదు' (నాస్తి శక్తిః పితుర్వాక్యం సమతిక్రమితుం మమ). రాముని ధర్మ దీక్షను కాదనలేక అతన్ని విడిచిపెట్టి ఉండలేక బాధపడుతున్న కౌసల్య మధ్యమార్గాన్ని సూచిస్తుంది. "రాజ్యం మన కక్కరలేదు. ఊరకే ఇక్కడ నా కళ్ళయెదుట ఉండి కాలక్షేపం చెయ్యి నాయనా, అందువల్ల ధర్మలోప మేమీ జరగదు" -- అని ఆమె మమకారంతో అంటుంది. సత్యసం-ధుడు ధర్మపరతంత్రుడు అయిన రాముడు ధర్మనిర్ణయాన్ని తల్లికి మెల్లగా నచ్చజెప్తాడు.

త్వయా మయా చ వైదేహ్యా లక్ష్మణేన సుమి
పితుర్నియోగే స్థాతవ్యం ఏష ధర్మః సనా

(తండ్రి ఆజ్ఞకు నేనే కాదు, నీవు, నేను, సీత, లక్ష్మణుడు, పిన్నమ్మ సుమిత్ర-- అందరమూ బద్ధులమే. ఇది సనాతనధర్మం. అడవికి వెళ్ళటం నా ధర్మం. ఆశీర్వదించి పంపించటం నీ ధర్మం. నీకు పరిచర్య చేస్తూ నీ దగ్గర ఉండటం సీత ధర్మం. భరతునితో సహకరించి రాజకార్యాలలో తోడ్పడటం లక్ష్మణుని ధర్మం. లక్ష్మణుడు ఆవేశపడకుండా విధ్యుక్తధర్మం నెరవేర్చేట్టు చూడటం సుమిత్ర ధర్మం.)

రాముడు చెప్పిన ఈ సనాతన ధర్మంలో సనాతన సత్యం ఇమిడి ఉంది. ఈ మాటలకు రాముడు ఆ క్షణంలో భావించిన అర్థం వేరు, తర్వాత జరిగిన సంఘటనలు నిరూపించిన యథార్థం వేరు. కైక కోరింది కేవలం రాముడి వనవాసమే కాని, సీతా లక్ష్మణులకు దీనితో ప్రమేయం లేదు. కాని, ఇద్దరూ తమంతట తాము రాముని వెంట బయలుదేరారు. రాముడు ఎంత నచ్చచెప్పినా వినక ఇద్దరూ రామునికంటె ముందుగా అడవికి ప్రయాణ మయినారు. ఈ విషయం రాముడు ఊహించి ఈ మాట అన్నాడో లేక అప్రయత్నంగా ఆయన నోట భవితవ్యం పలికిందో తెలియదు. కాని పైశ్లోకంలోని ప్రతి శబ్దం తర్వాతి సంఘటనల్లో ప్రతిబింబించింది. ఋషితుల్యుల వాక్కును ఇలాగే అర్థం అనుసరిస్తుందని వాగ్విదుల అనుభూతి. సీతారామ లక్ష్మణులకు వనవాసంతో ప్రత్యక్ష సంబంధం, కౌసల్యా సుమిత్రలకు పరోక్ష సంబంధం మరుక్షణంలోనే ఏర్పడ్డది. ఎవరి ధర్మాన్ని వాళ్ళు సక్రమంగా నెరవేర్చారు. ఇందులో ఎవరు పొలుమాలినా రామాయణం యథావిధిగా సాగేది కాదు. అడవుల్లో రాముణ్ణి అనుసరించటం సీతా లక్ష్మణుల ధర్మమయితే రామలక్ష్మణులను అనుమతించటం కౌసల్యా సుమిత్రల ధర్మమయింది. ఈ ధర్మ నిర్వహణలో సుమిత్ర కౌసల్యకంటె ముందంజ వేస్తుంది. అడవికి వెళ్ళవలసిన రాముణ్ణి పరి పరి విధాల వారించి చివరకు విధిలేక అనుమతిస్తుంది మమతామయి కౌసల్య. అసలు వనవాసంతో ప్రమేయంలేని లక్ష్మణమూర్తిని ఆనందంతో ఆశీర్వదించి పంపుతుంది సమతామయి సుమిత్ర. రాజును గురించిగాని, కైకను గురించి

గాని ఆమె పల్లెత్తు మాట అనదు. విధి విధానాన్ని ధైర్యంతో మౌనంగా హర్షించి అంగీకరించటమే ఆమె అభిమతం. "తండ్రీ, వనవాసం కోసం నీవు జన్మించినపుడు ఆలోచించవలసిన పని లేదు. ఆత్మీయులయందు నీకుగల అనురాగమే నిన్ను రామునివెంట తీసికొని పోతుంది. తండ్రి తరువాత తండ్రి లాంటివాడు రాముడు. తల్లిలా నిన్ను చూచుకుంటుంది సీత. సీతా రాముల సన్నిధిలో నీకు అరణ్యం కూడా అయోధ్యలా ఉంటుంది. సుఖంగా వెళ్ళు తండ్రీ!" అని ఎంతో మృదుమధురమైన మాటలతో కన్నకొడుకును అడవులకు సాగనంపుతుంది-- పరమ సాధ్వి సుమిత్ర. ఎంతటి సౌశీల్యం! సహనం! సమదృష్టి! కనకనే దశరథ మహారాజుకు సుమిత్రమీద మితిలేని మమత. పాయసం పంచి పెట్టేప్పుడు సుమిత్రకు రెండుసార్లు పాయసం ఇవ్వటంలో రాజు హృదయం తెలుస్తుంది. అలాగే అందరికీ అనుకూలంగా నడుచుకునే పేరుకు తగిన సుమిత్రకు ఇద్దరు కుమారులు కలుగుతారు. రామ కైంకర్యానికి లక్ష్మణుడు, భరతుని పరిచర్యకు శత్రుఘ్నుడు. ఒకరు భగవత్సేవకు అంకితమైతే మరొకరు భాగవతసేవకు అర్పితమై తమ జీవితా-లను చరితార్థం చేసుకున్న పుత్రరత్నాలను ప్రసవించిన పుణ్యగర్భ సుమిత్రను వాల్మీకి శ్రీకారంతో పోల్చటం గమనించదగిన విషయం. కౌసల్య, సుమిత్ర, కైక హ్రీ, శ్రీ, కీర్తికి ఉపమానంగా ఉన్నారని అంటాడు ప్రాచేతసుడు. కౌసల్య హ్రీమతి, సుమిత్ర శ్రీమతి, కైక కీర్తిమతి.

కైక మనస్సులో ఉన్నట్టుండి చెలరేగిన కీర్తి దుమారానికి రాజ వంశమంతా చలించింది. కాని, సత్య ధర్మ పరాక్రముడైన రాముడు ఝంఝూనిలాన్ని మలయమారుతంగా మారుస్తాడు. కీర్తికాంక్షతో తనను తాను మరచిపోయిన కైకేయికి తన కోరిక ధర్మసమ్మతమనే అనిపిస్తుంది. రాజు తనకు మాట యిచ్చి ఎలా తప్పగలడనే ధైర్యంతో ఆమె పట్టిన పట్టు ఏమాత్రం వదలదు. అంతఃపురంనుంచి మూడు వందల యాభైమంది రాముడు అడవికి వెళ్ళకూడదని ఘోషించినా కైక మనస్సు కరగదు. రాముడి మనస్సు చలించదు. సీతా రామ లక్ష్మణులు అడవికి వెళ్ళు

తుంటే అయోధ్యలో అణువణువూ కరుణామయ మవుతుంది. వసిష్ఠుడు, సుమంత్రుడు, దశరథుడు, పౌరులు--అందరూ కైకను అనరాని మాటలంటారు. కాని, ఆమె రాజు తనకిచ్చిన మాటను మూటగట్టుకొని బిగుసుకుపోతుంది. తన కోరిక ధర్మంకానీ, అధర్మంకానీ, అసత్యంకానీ ఆమెకు అక్కర లేదు. ఇస్తానన్న వరాన్ని ఇలా ఉపయోగించుకోవటమే ఆమె లక్ష్యం. వరం కోరేప్పుడు కూడా ఆమె దశరథుడితో స్పష్టంగా చెపుతుంది:

భవ త్వధర్మో ధర్మో వా సత్యం వా యది వాఽనృతమ్,
యత్త్వయా సంశ్రుతం మహ్యం తస్య నాస్తి వ్యతిక్రమః.

తన మాటకు తిరుగు లేదని యింత గట్టిగా చెప్పిన కైక మనస్సు కన్నకొడుకు భరతుడు తిరుగుబాటు చేస్తేనేకాని తిరగదు. భర్త ప్రాణాలు కోల్పోయినా ఆమె మనస్సు మారదు. కుమారుడు రాజయితే చాలనుకుంటుంది. కాని, తన ఆశలకు ఆధారమయిన భరతుడే తనను తూలనాడి రాముణ్ణి అడవినుంచి తీసుకొని వస్తానని ప్రతిజ్ఞ చేసిన తర్వాత ఆమెకు మెలకువ వస్తుంది. కాని, అప్పటికి కథ ఆరంభమయింది. చిత్రకూటందాకా సీతారామ లక్ష్మణుల అయనం సాగింది. రామతత్త్వం భరతునికి తెలుసు. కాని, రాముని యెదుట తన ఆవేదనను చెప్పుకొని ఎలాగయినా రాముడు తిరిగి అయోధ్యకు వచ్చేట్లు చూడాలని భరతుడు బ్రహ్మాండమంత భక్తితో బయలు దేరుతాడు.

చిత్రకూటంలో రామ భరతుల సమాగమం సత్యధర్మ సంరక్షణకు మరో కఠిన పరీక్ష. చిత్రకూటానికి భరతుడు ఒంటరిగా వెళ్ళలేదు. దాదాపు అయోధ్యా నగరమంతా అతనితోకూడా బయలు దేరింది. ఇంత బలగంతో గట్టి నమ్మకంతో ధర్మవత్సలుడు భరతుడు సత్యసంధుడైన రాముణ్ణి అనేక విధాల ప్రాధేయపడతాడు కాని, రామ భరతులు త్యాగమూర్తులు, తపోధనులు, ధర్మపరాయణులు, సత్యసంధులు. ఒకరిని మించినవారు మరొకరు. రాముడు భరతాగ్రజుడైతే, భరతుడు రామానుజుడు. నీవే రాజు వంటే నీవే

రాజువని (త్వమేవ రాజా ధర్మజ్ఞ) ఇద్దరూ ఒకరి కొకరు నచ్చ చెప్పేందుకు చూస్తారు. కాని, మనస్సు నొవ్వకుండా సత్య ధర్మ విమర్శ చేస్తారు. మధ్యలో వశిష్ఠుడు జోక్యం చేసుకొని రాముడికి చెప్తాడు:

భరతస్య వచః కుర్వన్ యాచమానస్య రాఘవ,
ఆత్మానం నాతివర్తేస్త్వం సత్యధర్మపరాక్రమ.

గురువుగారి హితవులో కూడా ఆత్మహితముంది. ఎలాగయినా రాముడు అయోధ్యకు వస్తే ధర్మం నిలబడుతుందని ఆయన శివకామన. తమ్ముడు భరతుడు కోరినట్టు చెయ్యటమే ఆత్మహిత మంటాడు. 'సత్య ధర్మ పరాక్రమ' అని సంబోధించటంలోకూడా గూఢమయిన అభిప్రాయం ఉంది. కులగురువుగా వశిష్ఠుడు వంశగౌరవానికి వ్యతిరేకమయిన హితవు చెప్పగూడదు. కనుక తుది నిర్ణయం రాముడికే వదలి వేస్తాడు.

చిత్రకూటం నిజంగా విచిత్ర కూటం. ఇక్కడి వాగ్వాదమంతా రాజ్యం కోసం, అధికారంకోసం, సుఖంకోసం, వ్యక్తికోసం కాదు. ధర్మంకోసం, సత్యంకోసం, సంయమంకోసం, లోకకల్యాణంకోసం ఇద్దరు అన్నదమ్ములు ఒకరి కొకరు నచ్చచెప్పకుంటున్నారు. పదవులకోసం పెదవులు కరుచుకొని ప్రజల హృదయాళ్లను వంచించే రాజకీయ నాయకులు నిత్యం మననం చేయవలసిన మహత్తరమైన సన్నివేశం చిత్రకూటవర్ణన. భౌతికమైన సంపదను తృణీకరించి శాశ్వతమైన విలువలను సమస్తలోకానికి చాటి చెప్పిన మహాకూటం చిత్రకూటం. చివరకు రామభద్రుని పాదుకలను మోసుకొని భరతుడు నందిగ్రామం చేరుతాడు. అరణ్యంలో రాముడు ఎలాంటి ఋషి జీవితం గడుపుతాడో అలాంటి సంయమంతోనే భరతుడు అయోధ్యను రాముని పేరిట పాలిస్తాడు. అయోధ్యలో భరతుడు, అరణ్యంలో రాముడు సత్య ధర్మ పరిపాలన సాగిస్తారు. ఇది రామాయణ మహాయనంలో స్వాధిష్ఠానం. ఎవరి స్థానం వాళ్ళు ఎన్నుకున్నారు. పాదుకలు స్వస్థానానికి చేరుకున్నాయి. పాదాలు దండకవనంలో సంచరించసాగాయి. ఈ విషయాన్నే రాముడు భరతునితో భంగ్యంతరంగా అంటాడు:

త్వం రాజా భరత భవ స్వయం నరాణాం
వన్యానా మహమపి రాజరాణ్మృగాణామ్,
గచ్ఛ త్వం పురవర మద్య సంప్రహృష్టః
సంహృష్ట స్త్వహమపి దండకాన్ ప్రవేక్ష్యే.

(భరతా! నీవు అయోధ్యకు రాజువు. నేను అరణ్యానికి రారాజును. నీవు నాగరికులైన నరులను పాలించు. నేను అరణ్యంలో విహరించే జంతువులను పాలిస్తాను. నీవు సంతోషంతో రాజధానికి వెళ్ళు. నేను ఆనందంగా దండకారణ్యంలో ప్రవేశిస్తాను.)

సత్య ధర్మ పరాయణుని తీర్పు ఎంత సమంజసంగా ఉంది! భరతుడు రాజయితే, రాముడు రారాజు భరత రాజ్యం పరిమితం. రామ రాజ్యం అపరిమితం. పాదచారియైన రామగమనానికి (అయనానికి) భరతుడు పూజించే పాదుకలు ప్రాతిపదికలు. అదే మూలాధారం. ఇది స్వాధిష్ఠానం. ఇక్కడినుంచి సీతారామలక్ష్మణుల లోకసంచారం ఆరంభమవుతుంది. భరతునికి లోకపాలనలో శత్రుఘ్నుడు సహకరిస్తే, రాముడికి లోక సంగ్రహంలో లక్ష్మణుడు తోడ్పడుతాడు. ఇలా నలుగురు అన్నదమ్ములు తండ్రికి మించిన తనయులుగా సత్య ధర్మాలను సాధిస్తారు.

* * *

# సంచారం

కంటికి కనిపించినదంతా లోకం. నాది, నీది, అది, యిది అనే భేదం లోక సామాన్యులను బాధిస్తూ ఉంటుంది. కాని, లోకోత్తరమైన ఆదర్శంతో లోకకల్యాణం సాధించదలచిన లోకనాయకులకు అందరూ స్వజనులే. సత్యమే వారికి సత్త్వం. ధర్మమే ధనం. చిత్రకూటంలోని చిద్విలాసం రాముణ్ణి ఇలాంటి లోకనాయకునిగా నిరూపిస్తుంది. దండకారణ్యంలో ప్రవేశించిన కోదండపాణికి ధర్మరక్షణ, సత్యపాలన తప్ప మరో ధ్యేయం లేదు. ఈ విషయమే నారదుడు వాల్మీకితో సూత్రప్రాయంగా అంటాడు:

> రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా,
> రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా

తనవారినీ, తన ధర్మాన్నీ, తన తోటి జీవకోటినీ రక్షిస్తూ ధర్మాన్ని పరిరక్షించటం రామభద్రుని స్వభావం. ముందు తనవారు, బంధువులు, మిత్రులు, ఆత్మీయులు వీరిని ప్రేమతో చూడటం ప్రథమ కర్తవ్యం. దీనికి మించింది తన ధర్మం. ఏది తగనిది అని నిర్ణయించేందుకు ఆధారం స్వధర్మం. స్వధర్మానికి మించింది లోకధర్మం. ఈ మూడింటిని సమీకరించేది సనాతన ధర్మం. ఈ నాలుగు సోపానాల్లో ధర్మాన్ని నిర్వహించటం ధర్మవత్సలుడైన రామచంద్రుని లక్షణం. దండక వనంలో ప్రవేశించినప్పటినుంచి ఈ ధర్మ పరిపాలనకు అవకాశం లభిస్తుంది.

అరణ్యంలో ప్రవేశించే ముందు సీతారామలక్ష్మణులు అత్రి ఆశ్రమం వెళుతారు. అక్కడ అనసూయ సీతను చాల అభిమానంతో చేరదీసి అంగరాగం, దివ్యాంబరం, దివ్యాభరణాలతో సత్కరిస్తుంది. లోకకళ్యాణ సాధనలో, ధర్మకార్య నిర్వహణలో రాముడికి సహధర్మ చారిణి సీత. ఆమెకు ఈ కార్య సంపాదనకు కావలసిన సాధన సంపదను అనసూయాదేవి అవ్యాజమైన అనురాగంతో అనుగ్రహిస్తుంది. అసూయ ఎరుగనిది అనసూయ. స్వపరభేదంవల్ల అసూయ ఏర్పడుతుంది. అందరిని ఆత్మీయులని భావించే ఔదార్యంవల్ల అనసూయకు అద్భుతమైన తపశ్శక్తి లభించింది. ఆ శక్తిలో కొంత భాగం ఆమెద్వారా సీతాదేవికి సంక్రమించింది.

అలాగే అగస్త్యాశ్రమంలో రామచంద్రునికి గొప్ప గొప్ప అస్త్రాలు, శస్త్రాలు అగస్త్యముని ప్రసాదిస్తాడు. కాని, అరణ్యంలో ప్రవేశించగానే ఈ అస్త్రాలు లభించవు. రాక్షసుల బాధలకు తాళలేక ప్రతిహింసకు పాల్పడలేక దండకారణ్యంలోని ఋషులందరూ రామభద్రునికి తమ ధర్మసంకటం చెప్పు కుంటారు. రాక్షసులను సంహరించి వారిని రక్షిస్తానని రాముడు వారికి వాగ్దానం చేస్తాడు. దారిలో విరాధుడు తారసిల్లుతాడు. రామలక్ష్మణులను భుజాలమీద ఎక్కించుకొని పారిపోతుంటే సీత భయపడుతుంది. కాని, కొత్తచోట దారి చూపిస్తున్నాడులే అని రాముడు చమత్కరిస్తాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత ఒక్కక్షణంలో విరాధ వధ జరుగుతుంది. చనిపోయిన తర్వాత విరాధుడు శాపవిముక్తుడైన గంధర్వుడనీ, అతని పేరు తుంబురుడనీ తెలుస్తుంది. విరాధుడు చేసిన సూచన ప్రకారమే రాముడు శరభంగ మహామునిని దర్శిస్తాడు. బ్రహ్మలోకానికి వెళ్ళనున్న శరభంగుడు రాముడు వస్తున్నాడని విని కొంచెముసేపు ఆగుతాడు. శరభంగ మహామునిద్వారా సుతీక్ష్ణ మహాముని సంగతి తెలుస్తుంది. అక్కడినుంచి అగస్త్యాశ్రమానికి సీతా రామలక్ష్మణులు వెళ్ళుతారు. ఇలా ఒకదాని కొకటి ఆధారంగా అనేక సంఘటనలు జరుగుతాయి. రాక్షస సంహారం, శాప విమోచనం, ఋషి సందర్శనం, ఇదే వరుస. అన్నీ బాగున్నాయి కాని, మనకు ద్రోహం తలపెట్టని రాక్షసులను ఇలా నిర్దాక్షిణ్యంగా చంపటం న్యాయమేనా? -- అని సీతమ్మకు సందేహం వస్తుంది. రాముడు ఆమెను సమాధాన పరుస్తాడు. లోకం నాకోసం ఎదురు చూస్తున్నదని రాముడు కైకేయితో చెప్పిన మాటలో రహస్యం ఇప్పుడు గోచరిస్తుంది. ఈ లోకరక్షణకు కావలసిన అస్త్ర శస్త్ర సంభారాన్ని అగస్త్యుడు రాముడికి ఇస్తాడు.

సీతమ్మకు అనసూయ, రాముడికి అగస్త్యమహాముని ఇలా లోక-కల్యాణానికి, ఆత్మ రక్షణకు కావలసిన సాధన సంపద ప్రసాదించటంలో రామాయణ మహాయనంలోని మరో మెట్టు మణిపూరం గోచరిస్తుంది.

అగస్త్య మహాముని ఆశీస్సులు పొంది, వారి అనుమతితో సీతా రామ లక్ష్మణులు గోదావరీతీరంలో పంచవటీ క్షేత్రంలో ఒక పర్ణశాల వేసుకొని

హాయిగా కాలక్షేపం చేస్తూఉంటారు. ఉదయం గోదావరీస్నానం, మధ్యాహ్నం తత్త్వజిజ్ఞాస, సాయంకాలం వనవిహారం--ఇలా రోజులు, వారాలు, నెలలు, ఋతువులు సాగిపోతుంటాయి. ఉన్నట్టుండి ఈ హాయికి అంతరాయం ఏర్పడుతుంది. రావణ సహోదరి శూర్పణఖ ఆ పరిసరాల్లో పచార్లుచేస్తూ ఒకనాడు హేమంతఋతువులో రామలక్ష్మణులను పర్ణశాలలో చూస్తుంది. కామదూరుడయిన రాముణ్ణి కామిస్తుంది. సీతను చూచి అసూయ పడుతుంది. రాముడు కాదంటే లక్ష్మణుడయినా సరేనని ఇద్దరిలో ఎవరినో ఒకరిని తన వానిగా చేసుకునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తుంది. రామ లక్ష్మణుల పరిహాసాన్ని అర్థం చేసుకోలేని మప్పనాతికి తగిన శాస్తి జరుగుతుంది. రాముని కనుసన్నలను గమనించిన లక్ష్మణుడు ఆమె ముక్కును, చెవులను కోసి అసలే అనాకారి అయిన ఆమెను మరీ వికారిగా చేసి పంపుతాడు. దీనితో శూర్పణఖకు అండ దండగా ఉన్న అన్నయ్యలు ఖరదూషణాదులు, రామలక్ష్మణులమీద కత్తి దూస్తారు. రాముడు ఒంటరిగా పద్నాలుగు వేల రాక్షసులను సంహరిస్తాడు. కాని శూర్పణఖకు జరిగిన పరాభవం రావణునిదాకా వెళ్తుంది. సీత అందాన్ని విని రావణుడు చలిస్తాడు. మారీచుని సాయంతో సీతను అపహరిస్తాడు. రామ లక్ష్మణులు జటాయువువల్ల జరిగిన వృత్తాంతం తెలుసుకుంటారు. సీతాపహరణం కంటె జటాయు మరణం రాముణ్ణి ఎక్కువగా బాధిస్తుంది. తండ్రిగా భావించి జటాయువుకు అంత్యక్రియలు చేసి సీతాన్వేషణకై బయలుదేరుతారు రామలక్ష్మణులు.

శూర్పణఖ వచ్చింది రాముడికోసం. కాని, పర్యవసానం సీతాపహరణం. ఒక విధంగా శూర్పణఖ కోరిందికూడా సీతావియోగమే. రావణుడు సాధించింది కూడా రామవిరహమే. సీతారాములు కలిసిఉన్నంతవరకు సోదరసోదరీమణుల కోరిక నెరవేరదు. చెల్లెలు రామభద్రుణ్ణి చేపట్టాలని చాటలవంటి గోళ్ళతో మొరటుగా పర్ణశాలపై విరుచుకు పడుతుంది. అన్న, సీతమ్మను అపహరించేందుకు దొంగ పన్నాగంతో సాధువేషంలో వచ్చి ఒంటరిగా ఉన్న సాధ్విని బలవంతంగా తీసుకొనిపోతాడు. శూర్పణఖ వ్యక్తిత్వం ఆమె నఖాల్లో(గోళ్ళలో) ప్రతిబింబితమైతే రావణుని దంభం అతని

శిరస్సులో కుంభించి ఉంటుంది. పరమాత్ముని కాలి గోళ్ళు పరంజ్యోతిని ప్రసరింపజేస్తాయని ప్రతీతి. శూర్పణఖ చేతిగోళ్ళు విషయవాసనలను విరజిమ్మాయి. గోళ్ళు వాసనకు, ఉపాసనకు కూడా పనికి వస్తాయి. జీవలక్షణాలు గల నిర్జీవ పదార్థాలలో గోళ్ళుకూడా పరిగణింపబడతాయి. కండూతికీ, పాండితికీ రెంటికీ గోళ్ళు వాటంగా, ఘాటంగా ఉపకరిస్తాయి. అలాంటి గోళ్ళతో శూర్పణఖ రామచంద్రుని సమీపిస్తుంది. చూచేందుకు చుక్క కూరలా చక్కగా, చిక్కగా ఉన్నాడుకదా అని నేను నీకు తగిన దాన్నని సిగ్గు లేకుండా చెప్పుకుంటుంది చుప్పనాతి శూర్పణఖ. సీతా సమేతుడయిన రామచంద్రు డెక్కడ? కొండల్లో కోనల్లో మానం వదలుకొని మైమరచి విహరించే శూర్పణఖ ఎక్కడ? ఇద్దరి రూపవైషమ్యాన్ని నిరూపిస్తూ వాల్మీకి అంటాడు:

సుముఖం దుర్ముఖీ రామం వృత్తమధ్యం మహోదరీ,
విశాలాక్షం విరూపాక్షీ సుకేశం తామ్ర మూర్ధజా.
ప్రియరూపం విరూపా సా సుస్వరం భైరవస్వనా,
తరుణం దారుణా వృద్ధా దక్షిణం వామభాషిణీ.
న్యాయవృత్తం సుదుర్వృత్తా ప్రియ మప్రియదర్శనా,
శరీరజ సమావిష్టా రాక్షసీ రామ మబ్రవీత్.

(శూర్పణఖ రాక్షసి. రాముడు పురుషోత్తముడు. రాక్షసీ రాముల రూప వైషమ్యం గమనించదగినది. ఆమె దుర్ముఖి. అతడు సుముఖుడు. ఆమె మహోదరి. అతడు సన్నని నడుముగల సుకుమారుడు. ఆమె విరూపాక్షి. అతడు విశాలమైన కన్నులుగలవాడు. ఆమెది ఎర్రని రాగిజుట్టు. అతనిది నల్లజుట్టు. ఆమె వికృతాకారంతో విపరీతంగా పెరిగిన వయోవృద్ధ. అతడు పిన్న వయసులో వెన్నలా కన్నుల విందుగా కనిపించే కమనీయ స్ఫురద్రూపి. ఆమెది కఠోరమైన కంఠం. అతనిది మృదుమధురమైన స్వరం. కట్టె విరిచినట్లు మాట్లాడే గడుసుదనం ఆమెలో కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. అతడు అన్నివిధాలా అందరికీ అనుకూలంగా అణకువతో మాట్లాడే ప్రియంవదుడు. ఆమె కామాంధురాలయిన కామిని. అతడు న్యాయసమ్మతంగా నయ వినయాలతో వ్యవహరించే ప్రియదర్శనుడు.)

ఇలాగే రామ రావణులకు మధ్యగల వ్యత్యాసాన్నిగూడా సీతాదేవి రావణునికి స్పష్టంగా చెపుతుంది. సింహంముందు నక్కలా రావణుడు రాముని యెదుట నిలబడేందుకుకూడా పనికిరాడని ఆమె చెపుతుంది. మురికికాలువకూ మున్నీటికీ, ఇనుముకూ బంగారానికీ, బురదకూ గంధానికీ, కాకికీ గరుత్మంతునికీ ఎంత భేదముందో అంత వ్యత్యాసం రావణుడికీ రాముడికీ ఉందని ఆమె తనను అపహరించేందుకు వచ్చిన రావణుడితో నిర్భయంగా అంటుంది. తపస్సు, వర్చస్సు, ఓజస్సు--ఎన్ని ఉన్నా ఒక్క ధర్మం లోపించటంవల్ల కామమోహితుడైన రావణుడు లోక రావణుడవుతాడు. సత్య ధర్మ పరాయణుడైన రామచంద్రునికి దూరమవుతాడు. శూర్పణఖది సుఖప్రధానమైన వ్యక్తిత్వమయితే రావణుడు శిరఃప్రధానుడు. ఒకటికి పది తలలుగల పెద్ద మనిషి. మంచికి, చెడుకు కూడా శిరస్సే ఆధారం. మంచి మంచి ఆలోచనలతో మంచిని తలపెట్టి ప్రపంచంలో మంచిని పంచగలది, తలపులకు నిలయ మయినది తలయే. ఆ తలకాయలోనే ప్రపంచాన్ని ముంచివేసే దురాలోచనలు కూడా బయలు దేరవచ్చు. శూర్పణఖ గోళ్ళవలె రావణాసురుని తలలుకూడా మంచిని అణచివేసి చెడును చేరదీస్తాయి. పర్యవసానం రావణ సంహారం, శ్రీరామ విజయం, సీతావిముక్తి. ఈ శుభాంతానికి బీజం శూర్పణఖ పరాభవం, సీతాపహరణం. శూర్పణఖ లేకుంటే తర్వాత కథే లేదు. రామాయణ పరమార్థమే నెరవేరదు. కాబట్టి శూర్పణఖ వృత్తాంతం రామాయణ కథలో కీలకమైన నాభిస్థానాన్ని పొందుతుంది. కైకవరంతో రామాయణంలోని బ్రహ్మగ్రంథి విచ్ఛిన్నమయితే శూర్పణఖ పరాభవంతో విష్ణుగ్రంథి విడిపోతుంది. ఇక రుద్రగ్రంథి వైపు రామాయణం పయనిస్తుంది.

వాల్మీకి చిత్రించిన రాముడు అమాయకుడైన మానవుడు. అందువల్లనే మాయలేడివెంట పరుగెత్తి సీతను సంతోషపెట్టేందుకు ప్రయత్నిస్తాడు. ఎక్కడ చూచినా ఎప్పటికప్పుడు ప్రమాదలక్షణాలు కనిపిస్తున్నాయని (ప్రతి క్షణం సర్వత ఏవ శంకితః) అనుమానిస్తూనే మారీచుని వెంట వెళతాడు. తిరిగి వచ్చేసరికి దారుణమైన వార్త తెలుసుకొని పసిపిల్లవానివలె విలపిస్తాడు. చెట్లను, చేమలను, పూలను, తీగలను, జలచరాలను, జంతువులనూ

మా సీతను మీరేమైనా చూచారా అని అమాయకంగా అడుగుతాడు. సీత లేకుండా తిరిగి అయోధ్యకు ఎలా వెళ్ళటం అని దిక్కుతోచక దిగజారి పోతాడు. "రాజ్యం పోయింది, అరణ్యం శరణ్యమయింది. కట్టుకున్న భార్య కనిపించకుండా పోయింది. చివరకు నాకోసం తెగించి పోరాడిన యీ పక్షినికూడా బతికించుకోలేక పోతున్నా"నని జటాయువును చూచి వాపోతాడు.

రాజ్యం భ్రష్టం వనే వాసః సీతా నష్టా మృతో ద్విజః,
ఈదృశీయం మమాలక్ష్మీర్దహేదపి హి పావకమ్.

నన్ను ఆవరించిన అలక్ష్మి అగ్నినికూడా దహించగలదని దారుణమైన దుఃఖంతో కుమిలిపోతాడు సామాన్య మానవుడిలా సత్య పరాక్రముడు. 'అన్నా! ఇలా చింతించటం నీకు తగదు. దేవతలకుకూడా బోధపడని నీ ధీశక్తిని గుర్తించి ధైర్యం తెచ్చుకో' అని తమ్ముడు ధైర్యం చెపుతాడు. అన్నదమ్ములు ఒకరి కొకరు ధైర్యం చెప్పకొని, సీతాన్వేషణకై కొండల్లో కోనల్లో సంచారం సాగిస్తారు. సీతజాడ కనిపించక పోగా అయోముఖి, కబంధుడులాంటి రాక్షసులను ఎదుర్కొనవలసివస్తుంది. లక్ష్మణుణ్ణి ప్రేమతో లాలించి తన వలపుల వలలో వేసుకొనవలెనని చూచిన అయోముఖికి శూర్పణఖకు జరిగిన పరాభవమే జరుగుతుంది. శుభాశుభ లక్షణాలు కలగలుపుగా కనిపిస్తున్న కాననసీమల్లో కొంచెం ముందుకు సాగేసరికి కబంధుడు కనిపిస్తాడు. నడుము నుండి మెడవరకే అన్ని అవయవాలనూ కుదించుకొని విశాలబాహువులతో విపులారణ్యంలో విహరిస్తున్న భయంకరాకారం చూచి లక్ష్మణుడు భయపడతాడు. కాని, రాముడు ధైర్యంతో కబంధుడు వాళ్ళిద్దరినీ కబళించబోయేవరకు వేచి చూస్తాడు. చివరకు ఆత్మ రక్షణకోసం రామలక్ష్మణు లిరువురూ చెరి యొక బాహువును ఛేదిస్తారు. కబంధుడు నిజంగా రాక్షసుడు కాడు. శాపగ్రస్తుడయిన సుందరాంగుడు. బాహువులు తెగిపోగానే అతనికి స్వ స్వరూపం గోచరిస్తుంది. తన పార్థివశరీరాన్ని దహనం చేస్తే ఆపదలో నున్న రామలక్ష్మణులకు ఆప్తులయిన మిత్రులను చేరే దారి తెలుపగలనని అంటాడు. అలాగే దహనం చెయ్యగానే అతడు దివ్యరూపంలో రామలక్ష్మణులకు సాక్షాత్కరించి పంపాతీరంలో

ఋష్యమూకపర్వతంమీద సుగ్రీవుడనే వానరరాజున్నాడనీ, అతనితో సఖ్యం చేస్తే తమ కార్యం నెరవేరుతుందనీ సూచిస్తాడు. పరమ రమణీయమైన పంపాసరోవరంయొక్క ప్రాశస్త్యాన్ని పారవశ్యంతో వివరిస్తూ ఆ సరస్సు ఒడ్డునే ఉన్న మతంగవనాన్నీ, ఆ వనంలో ఉన్న శబరిని కూడా వర్ణిస్తాడు. ఈ వర్ణనలు కబంధుని నోట వింటుంటే అతనికి తెలిసిన రహస్యాలు మరెవ్వరికీ తెలియవని తోస్తుంది.

అసలు కబంధ వృత్తాంతమే ఒక రహోగాథ. మరణించిన తర్వాతనే అతనికీ రహస్యాలన్నీ తెలుస్తాయి. పార్థివబంధంనుండి ముక్తి లభించిన తర్వాతనే అతని దివ్యత్వం వ్యక్తమవుతుంది. ఈ ఘట్టాన్ని జాగ్రత్తగా పరిశీలించి చూస్తే ఇది రామాయణ మహాయనంలో అనాహత నాదాన్ని వినిపించే మహత్తరమైన సోపానంగా గోచరిస్తుంది. కబంధుడు రామలక్ష్మణులకు కనిపించేముందు అతని శబ్దం వాళ్ళకు వినిపిస్తుంది.

సంజజ్ఞే విపులః శబ్దః ప్రభంజన్నివ తద్వనమ్,
సంవేష్టితమివాత్యర్థం గహనం మాతరిశ్వనా.

దట్టమైన అరణ్యాన్ని చీల్చుకొని స్వయంగా వాయుదేవుడే ప్రవేశించినట్టుగా నలువైపుల విస్తరించిన మహారవం వినిపించిందట. మహారవంతో ప్రవేశించిన కబంధుడు మహానాదంతో నిష్క్రమిస్తాడు. అతని శరీరం నశించినా అతని నాదం నశించదు. ఇదే రామకథా నాదంలోని అనాహత తత్త్వం. కైక వరాల్లో మూలాధారాన్ని వదలిన కుండలినీయానం పాదుకా పట్టాభిషేకంలో స్వాధిష్ఠానాన్ని చేరి, అత్రి, అనసూయ, అగస్త్యుల వంటి మహర్షుల మన్ననలలో మణిపూర మాధుర్యాన్ని ఆస్వాదించి, కబంధ శాప విమోచనంలో అనాహత నాదాన్ని వింటుంది. మూలాధారంలోని శుద్ధ పార్థివ తత్త్వం స్వాధిష్ఠాన, మణిపూరాల్లో నీటినీ, నిప్పునూ మాటుపెట్టుకొని అనాహత నాదంలో వాయుయానాన్ని అధిరోహిస్తుంది. ఇక చేరవలసింది విశుద్ధిచక్రంలోని ఆకాశ తత్త్వం. దానికి కబంధుని అనాహతనాదమే దారి చూపిస్తుంది. పంపాసరోవరం, సుగ్రీవ (కమ్మని కంఠం) మైత్రి, హనుమత్సమాగమం అన్నీ పవనసంభవమైన పావన వాగ్విభూతికి సూచనలు. ఇది సామాన్యమైన వాక్సంపద కాదు, ఋషి భాషితమైన ఋష్యమూకం.

కంఠభాగాన్ని క్రమంగా వాలి సుగ్రీవులు శాసిస్తారు. కనుకనే వాలివధ, సుగ్రీవ పట్టాభిషేకం రామునికి అభీష్టసిద్ధిని ప్రసాదించాయి. వాలి వాలానికీ, సుగ్రీవుడు కంఠానికీ ప్రతినిధిపాత్రలు. వాలి ఇంద్రుని కుమారుడు. ఇంద్రియ లోలుడు. సుగ్రీవుడు సూర్య తనయుడు. వినయ సంపన్నుడు. ఇంద్రియ నిగ్రహం, వాక్శుద్ధి కిష్కింధలో రాముడు సాధించిన రెండు మహత్తర కార్యాలు.

కథను కథగా చూస్తే వాలివధ అన్యాయంగా అక్రమంగా అసంబద్ధంగా కనిపిస్తుంది. కాని, కథలోని అంతరార్థాన్ని గమనిస్తే వాలివధలోని పరమార్థం, సుగ్రీవ మైత్రిలోని సారస్యం గోచరిస్తుంది. వాలిని సంహరించి సుగ్రీవునికి పట్టం గట్టిన తర్వాతనే సీతాన్వేషణం సరియైన పద్ధతిలో సాగుతుంది. రామ లక్ష్మణులు ఒంటరిగా అడవుల్లో తిరుగుతూ సీతను వెదకటంకంటె సుగ్రీవుని సాయంతో వేలకొలది వానరులచేత వెదకించటంలో ఔచిత్య ముంది. భ్రాతృమాత్సర్యంవల్ల పోగొట్టుకొన్న రాజ్యలక్ష్మినీ, గృహలక్ష్మినీ మళ్ళీ రామానుగ్రహంవల్ల సంపాదించుకొని సుగ్రీవుడు ప్రత్యుపకారంగా తన సేనను సీతాన్వేషణకై నియోగిస్తాడు.

**మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే,**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః.**

అన్నట్టు వేలకొలది వానరులు సుగ్రీవాజ్ఞను శిరసావహించి సీతజాడ కనుక్కొనేందుకు నలువైపులా వెళ్లుతారు. కాని, అంతమందిలో ఒక్కరే దీనికి సమర్థులని రామస్వామికి తెలుసు. అందరిలో హనుమంతుణ్ణి వేరుగా పిలిచి అతనికి ఆనవాలుగా తన పేరు గల ఉంగరం ఇచ్చి, రామభద్రుడు భద్రంగా వెళ్లిరమ్మని పంపుతాడు. సుగ్రీవుడు వానరులకు ఇచ్చిన ఆజ్ఞ 'సుగ్రీవాజ్ఞ'గా ఇప్పటికీ ప్రఖ్యాతంగా ఉంది. ఇదే ఆజ్ఞాచక్రం. ఆజ్ఞాచక్రం అప్పజెప్పిన కర్తవ్యాన్ని ఆప్తసచివుడు హనుమంతుడు రామబాణంలాంటి సంకల్పశుద్ధితో స్వీకరించి మహాలావణ్యశేవధియైన తల్లిని అమరావతి లాంటి లంకలో సాక్షాత్కరించుకుంటాడు.

* * *

# సందర్శనం

సంస్కారములేని వాక్కు అనుకున్న దానికి బదులు మరోభావాన్ని ప్రకటించినట్టుగా రామభద్రుని భార్య లంకానగరం చేరింది. లోక రావణుడయిన రావణుడు ఆమెను బలవంతంగా తీసికొనిపోయి అశోకవనంలో ప్రవేశ పెట్టాడు. సిద్ధ, చారణ, గంధర్వులు ఇంత ఘోరం జరుగుతూ ఉంటే చూస్తూ ఊరుకున్నారు. చారణులకు తెలిసిన యీ మార్గాన్ని అనుసరించి హనుమంతుడు రామకార్య నిర్వహణకై బయలుదేరాడు. ఎలాగయినా సరే తల్లిజాడ తెలుసుకొని రావాలి. శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని దాటగల దిట్ట ఎవరని అంగదాదులు బలాబలాలను పరామర్శించుకుంటూవుంటే హనుమంతుడు మౌనంగా ఒక మూల కూర్చుంటాడు. సుగ్రీవాజ్ఞ, రామానుగ్రహం - ఈ రెంటిని కంటి రెప్పలలో కూర్చుకుని పావని ధ్యానపరాయణుడయినాడు. ఆత్మీయుల ప్రోత్సాహంతో లోపల దాగియున్న ధైర్యసాహసాలు బహిర్గతమయినాయి. ఇంతవాడంతవాడయినాడు. ఒక్క గంతులో సముద్రాన్ని దాటేంత బలం అతన్ని పురికొల్పింది. రామబాణంలాగా సముద్రం మీదుగా అంతరిక్షాన్ని చీల్చుకుని హనుమద్గాత్రం రివ్వున బయలుదేరింది. దారిలో మైనాక పర్వతం ఎదురయి కొంచెం విశ్రాంతి తీసుకొని వెళ్ళవలసిందని పరిపరి విధాల బతిమలాడింది. తల్లి జాడ తెలుసుకొని రామచంద్రునికి విన్నవించుకొనేవరకు క్షణం తీరదని దాటిపోయాడు. పిట్టలా వెళ్ళుతున్న వానరుని గుటుక్కున మింగేందుకు సింహిక నోరు విప్పింది. బుద్ధిబలంతో ఆ రాక్షసిని మోసగించి తప్పించుకున్నాడు. ఉన్నట్టుండి క్రిందికి లాగుతున్న ఛాయాగ్రాహిణి మాయను క్షణంలో విచ్ఛిన్నంచేసి పొద్దు క్రుంకేసరికి లంకలో అడుగు పెట్టాడు. లంకానగరాన్ని రేయింబవలు కాపాడుతున్న లంకేశ్వరిని ఒకే ఒక ముష్టి ప్రహారంతో నేలమట్టం చేశాడు. లంకాపురిని తేరిపారచూచాడు. దేవనగరంలా దివ్యంగా ఉంది. ఒకవైపు వేదమంత్రాలు, మరోవైపు సాయుధ బలం, నలువైపులా మిరుమిట్లు గొలిపే రాజభవనాలు, గాలిని కూడా చొరనివ్వని రాజభటులు, మానవమాత్రుల మాట అటుంచి దేవ దానవులకుకూడా ఆ నగరంలో ప్రవేశించటం సాధ్యం కాదు. ఎలాగో తాను వచ్చాడు. ఇక వచ్చిన పని మెలకువతో సాధించాలి.

ఇక్కడినుంచి అసలయిన అన్వేషణ ఆరంభమవుతుంది. ఆత్మాను సంధానంలాగా సీతాన్వేషణ సాగుతుంది. ఆత్మయోగి శారీరకములయిన సంబంధాలను, అనుబంధాలను విసర్జించి ఆత్మపరాయణుడయినట్టుగా హనుమంతుడు సూక్ష్మరూపాన్ని ధరిస్తాడు. చీకటి పడేందుకు, చంద్రుడు ఉదయించేందుకు వేచి ఉంటాడు. అది పున్నమ అయి ఉంటుంది. సూర్యు డస్తమించగానే చంద్రు డుదయించాడు. తాను చంద్రునికోసం చూస్తున్న ట్టుగా రామచంద్రుని కోసం ఎదురు చూస్తున్న రామేక్షణి (సీతమ్మ) ఎక్కడ ఎలా కనిపిస్తుందా అని ఆవేదనతో, ఆందోళనతో, ఆకాంక్షతో హనుమంతుడు అంతఃపురమంతా గాలించి చూస్తాడు. అంతఃపురంలో వేలకొలది స్త్రీలు కనిపిస్తారు. ఒక్కొక్కరిని వేరు వేరుగా జాగ్రత్తగా గమనించి ఈమె కాదు మాతల్లి, ఈమె కాదని అందరినీ చూచి చూచి పరస్త్రీలను పడుకగదుల్లో చూడటంవల్ల తనకు ధర్మలోపం జరిగిందని పరితపిస్తాడు. కాని, సీతాను-సంధానం లక్ష్యంగా తాను పరస్త్రీలను చూచాడే కాని, దురుద్దేశ్యంతో మలినమైన దృష్టితో చూడలేదని తిరిగి సమాధాన పెట్టుకుంటాడు. సాంసారిక విషయ వాసనలతో విసిగి వేసారిన యోగిలాగా ఇంత వెదకినా అసలామె కనిపించలేదని దిగులు పడతాడు, దిగజారిపోతాడు. కాని, దిగజారడం సాధకుని లక్షణం కాదని మళ్ళీ తానే ధైర్యం తెచ్చుకుంటాడు. చివరకు రావణుడు శయ్యాగృహంలో కనిపిస్తాడు. మినుముల కుప్పలా మిసమిసలాడే అతనికి సమీపంలో ఒక అతిలోకసుందరి కనిపిస్తుంది. బహుశా ఆమె సీత అయివుండవచ్చు ననుకొని హనుమంతుడు ఆనందంతో చిందులు వేస్తాడు. కాని, రామవియోగంతో బాధపడుతున్న సీతాదేవి ఇలా హాయిగా నిద్రపోతుందా అని అనుమానించి మళ్ళీ సీతాన్వేషణ సాగిస్తాడు.

చివరకు అశోకవనంలో శోకంతో కృశించినా పరిసరాలను ప్రకాశింప-జేస్తున్న దేవిని చూచి హనుమంతుడు ఆనందంతో పొంగిపోతాడు. పసిడి వన్నెతో కళకళలాడే శింశుపా వృక్షం. చుట్టూ స్వచ్ఛమైన శీతల జలంతో ప్రవహిస్తున్న నది. ప్రభాత సమయం. వెయ్యిస్తంభాల మధ్య నెలకొనియున్న తెల్లని కైలాసం లాంటి వేదికపై బాలచంద్రునిలా కూర్చొనియున్న రామపత్ని అచ్చం రామభద్రునిలా కనిపిస్తుంది. ఆమెను చూడగానే హనుమంతుని

మనస్సు రామపాదాలపై లయించి పోతుంది. ఇంత ఉత్తమురాలికి ఇంత ఆపద సంభవించిందని ఎంతో విచారిస్తాడు. ఆ తల్లి తనవైపు ఎప్పుడు చూస్తుందో అని ఎదురుచూస్తుంటాడు. కాని, ఆమె చూపులు అక్కడ పరిసర ప్రాంతాలపై లేవు. దూరదేశంలో తనకోసం తపిస్తున్న తాపస వేషధారియైన రామచంద్రుని ముఖమండలాన్ని ఆమె మనశ్చక్షువులు తదేక దృష్టితో చూస్తున్నాయి. ఆమెకు తనచుట్టూ కూర్చునియున్న రాక్షస స్త్రీలు కనిపించటం లేదు. పైనున్న హనుమంతుడు ఓపికతో రామాక్షి కటాక్షవీక్షణంకోసం రామచంద్రుని స్మరిస్తూ కూర్చున్నాడు.

ఇంతలో రావణాసురుడు ప్రభాతసమయంలో ఆమె ప్రేమను కోరి వస్తాడు. నయంగా వినయంతో తన అనురాగాన్ని విన్నవించుకుంటాడు. లాభం లేదని తెలుసుకొని లోభం చూపిస్తాడు. అదికూడా పనికిరాదని గమనించి భయపెడతాడు. కత్తి చూపిస్తాడు. అంతఃపురకాంతలు వారిస్తే రెండు మాసాలు గడువిచ్చి కోపంతో వెళ్ళిపోతాడు. ఇదంతా హనుమంతుడు చూస్తూ ఉంటాడు. రావణుడు వెళ్ళిపోగానే రాక్షసస్త్రీలు సీతాదేవిని అనరాని మాటలంటారు. ఆమెను అమాంతంగా తినివేయాలని పన్నాగం వేస్తారు. ఇంతలో త్రిజట అనే ఆమెకు రామ రావణ యుద్ధంలో రాముడు జయించినట్లు, సీతా సమేతుడై శ్రీరాము డయోధ్యకు వెళ్ళినట్లు కల వస్తుంది. ఆ కల విని మిగిలిన స్త్రీలు కలవరపడి సీత కాళ్ళమీద పడుతారు. సీత దిగులుతో కుమిలిపోయి విలపిస్తుంది.

ఇంతలో పైనుంచి రామకథా సంగీతం వినిపిస్తుంది. తల్లి తనవైపు చూడగానే రామదూత ఉప్పొంగిపోతాడు. తనంతట తాను తల్లి అనుగ్రహించాలి కాని, తనకై తాను తల్లిని పలకరించుకునేందుకు తనకు అధికారం లేదని మారుతికి తెలుసు.

యమేవైష వృణుతే తేన లభ్యః,
తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్.

ఆత్మసందర్శనానికి అర్హత ఉంటే ఆత్మ తత్త్వం తనంతట తాను ఆత్మయోగికి సాక్షాత్కరిస్తుంది. ఆ క్షణంకోసం నిరీక్షిస్తున్న హనుమ రామనామం చేస్తూ అమ్మణ్ణిని సమీపిస్తాడు.

చూడదగిన సౌందర్యాన్ని కన్నుల పండువుగా చూచిన మారుతి తల్లికి రామసందేశం వినిపిస్తాడు. రామనామాంకితమైన ముద్రికను అందిస్తాడు. పుట్టెడు దుఃఖంతో పొగిలిపోతున్న తల్లిని ఓదార్చేందుకు హనుమ అనేక విధాల ప్రయత్నిస్తాడు. కావాలంటే అప్పటి కప్పుడే ఆమెను తన భుజాల మీద ఎక్కించుకొని రామసన్నిధికి చేరుస్తానంటాడు. అది ధర్మం కాదని తల్లి చెప్పగానే ఆమె నిజంగా సీతాదేవి అని రూఢి చేసుకుంటాడు. అమ్మ వారి ఆనవాలు తీసుకొని ఆమె సెలవు తీసుకుంటాడు. సీతా సందర్శనం హనుమకు ఎంత ఆనందాన్ని ఇస్తుందో హనుమత్ సంభాషణం దేవికి అంత ఉత్సాహాన్ని కలుగజేస్తుంది.

కాని, హనుమంతుని లంకాయాత్ర అంతటితో ముగియదు. లంకాధిపతిని చూడకుండా దొంగలా వచ్చి దొంగగా పారిపోవటం హరిపుంగవునికి మనస్కరించదు. ఆకలి తీర్చుకొనే నెపంతో ప్రమదావనాన్ని ధ్వంసం చేసి రావణుని రెచ్చగొడతాడు. రావణకుమారుడు ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రానికి తాత్కాలికంగా లొంగి రావణుని దగ్గరికి వెళ్ళుతాడు. రావణునికి చెయ్యవలసిన హితబోధ చేస్తాడు. కామాంధుడు కాలచోదితుడయిన రావణుడు హనుమశక్తి తెలియక ఈ కోతిని చంపవలసిందని ఆజ్ఞాపిస్తాడు. దూతవధ తగదని విభీషణుడు వారిస్తే తోకకు నిప్పంటించవలసిందని ఆజ్ఞాపిస్తాడు. మంచి అవకాశం చిక్కిందని హనుమ మండే తోకతో లంకనంతా కాలుస్తాడు. ప్రళయానలంలాంటి యీ అగ్ని కాండకు లంకంతా గురి అవుతుంది. కాని, సీత అక్షతంగా ఉండటం ఆశ్చర్యం. సీతాదేవి మహిమవల్లనే తనకు కూడా అగ్ని హిమఖండంలా చల్లగా ఉన్నదని గ్రహిస్తాడు. ఈ సందీపన కార్యక్రమంతో హనుమకు సీతా తత్త్వం పూర్తిగా బోధపడుతుంది. అగ్నికి అగ్నిగా నిలబడిన తల్లి ఆత్మశక్తిని గమనించిన హనుమ తిరిగి కిష్కింధకు వెళ్ళి లంకలో జరిగింది జరిగినట్టు అందరికీ చెప్తాడు. శ్రీరామచంద్రునికి ఏకాంతంగా కొన్ని రహస్యాలు చెప్తాడు. హనుమ సాధించిన విజయానికి రామభద్రుడు సంతోషించి హనుమను ఆలింగనం చేసుకుంటాడు. సీతారాముల స్నేహానుబంధాన్ని ప్రత్యక్షంగా సాక్షాత్కరించుకొన్న హనుమంతుని లంకాయాత్ర రామాయణంలోని పరమ

రమణీయ సన్నివేశం. అందుకనే యీ కథాభాగాన్ని వాల్మీకి సుందరకాండ అన్నాడు. సుందరకాండలో సుందరం కానిది లేదని రసజ్ఞులు ప్రశంసించారు. ఇందులోని సౌందర్యం పార్థివసౌందర్యం కాదు. ప్రాపంచిక భోగాలను పరిత్యజించి పతినే పరమాత్మగా భావించి పారలౌకిక పరమార్థంకోసం పరితపించిన పరమ సాధ్వి సీతామాత సౌశీల్యం ఇందులోని సౌందర్యం. అటు రామవియోగంతో బాధపడుతున్న సీతాదేవికీ, ఇటు సీతావియోగంతో కుమిలిపోతున్న రామచంద్రునికీ మంచి మంచి మాటలతో మనస్తాపాన్ని పోగొట్టిన మారుతి వాగ్విభూతి సుందరకాండలోని నిజమైన సౌందర్యం. 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ' అని శ్రుతి ప్రతీతి. ఆత్మ తత్త్వాన్ని అందుకునేందుకు వాక్కు చాలదట. మనసు అంతవరకు పయనించలేదట. కాని, రామానుగ్రహం ఉంటే వాక్కు, మనస్సు అభీష్ట-సిద్ధిని పొందగలవని సీతా హనుమద్వృత్తాంతం నిరూపిస్తుంది. పలుకులలో దైన్యం తెలియని తల్లిని మంగళకరమైన మంచి మాటలతో నేను సంతోష పెట్టేందుకు ప్రయత్నించానని హనుమంతుడు రామునితో చివరి మాటగా చెపుతాడు. దీనినిబట్టి సుందరకాండలోని సౌందర్యసారం మంచి మనసు, మంచి మాట అని తేటతెల్ల మవుతుంది. సీతారాములవంటి మనో నైర్మల్యం, హనుమంతుని లాంటి వాక్సంపద ఆత్మ సౌందర్య సందర్శనాన్ని సాధించగలవన్న పరమ సత్యం సుందరకాండ మనకు అందించే సందేశసారం.

సుగ్రీవుని ఆజ్ఞ ఈ వాఙ్మనస్సంయోగానికి దారి చూపుతుంది. సీతారాముల మనస్సును రంజింపజేసే మంగళకరమైన వాగ్విలాసం హనుమంతుని సొత్తు. ఈ సొత్తును పురస్కరించుకునే ఆయన తాను సుగ్రీవునికి విత్త సచివుణ్ణని రామలక్ష్మణులకు చెప్పుకుంటాడు. వాక్కు మనస్సులో, మనస్సు వాక్కులో లయించినప్పుడే పరతత్త్వం ప్రత్యక్షమవుతుందని మంత్రద్రష్టలు చెపుతారు. అశోకవనంలో హనుమంతుడు చూచిన అతిలోకసౌందర్యం ద్రష్టలు సూచించిన యీ పరతత్త్వమే. కనుకనే లంకనుండి తిరిగివచ్చిన తర్వాత హనుమంతుడు మొట్టమొదట చెప్పిన మాట 'దృష్టా' (చూడబడింది లేక చూచాను) అని. కాబట్టి సుందరకాండ రామాయణంలోని రమణీయమైన దృష్టిని స్పష్టం చేస్తుంది. దశరథుడు చేసిన పుత్రకామేష్టి,

జనకుడు చేసిన ధనుర్యజ్ఞం సీతారాములకు ఇష్టిని సమకూరుస్తాయి. ఇష్టితో ఆరంభించిన సీతారాముల అయనం హనుమంతునివంటి ఉపాసకులకు ఉపాస్యమైన దృష్టిని ప్రసాదిస్తుంది. ఈ దృష్టిని పురస్కరించుకొని వానరసేనలు రామలక్ష్మణుల నాయకత్వంలో రాక్షససేనతో పోరాడి సత్య పరాక్రమునికి విజయం చేకూర్చుతాయి. దానితో సత్యానికీ, ధర్మానికీ తుష్టి, పుష్టి లభిస్తాయి. రామరాజ్యంలో లోకమంతా ఆనందించిందని చెపుతూ వాగ్విశారదుడైన నారదుడన్న మాటలు గమనించ దగినవి:

ప్రహృష్టో ముదితో లోక స్తుష్టః పుష్టః సుధార్మికః.

ఈ తుష్టికీ, పుష్టికీ ఆధారం సౌందర్యసందర్శనంలో విశిష్టమైన దృష్టి. సుగ్రీవుడు వానరసేనకు ఇచ్చిన ఆజ్ఞ, ఆజ్ఞాచక్రాన్ని సూచిస్తే హనుమంతుడు సాధించిన సీతాసందర్శనం సహస్రార కమలంలోనుంచి అమృతధారలతో అఖిల జగత్తును అభిషేకించే బిందు సౌందర్యాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ బిందుసందర్శనం మొదట హనుమంతునికి ఒక్కనికే లభిస్తుంది. పక్కనున్న త్రిజటకుకూడా ఈ సౌందర్యసారం కలలా కనిపిస్తుంది. ఈ సౌందర్యం--అందం--సకల చరాచర జగత్తుకు అందేట్లు చూడటమే రామాయణ పరమావధి. దానికే రామ రావణ సంగ్రామం. అదే శ్రీరామ విజయం, రామాయణ చరితార్థం.

* * *

# విజయం

గగనం గగనాకారం సాగరః సాగరోపమః,

రామరావణయో ర్యుద్ధం రామరావణయో రివ.

ఆకాశం అచ్చం ఆకాశం లాగానే ఉంటుంది. సముద్రం సరిగా సముద్రం లాగానే ఉంటుంది. అలాగే రామ రావణ సంగ్రామం రామ రావణుల సంగ్రామంవలెనే ఉందని గంధర్వులు, అప్సరసలు ప్రశంసించారట. రామరావణయుద్ధం దాని కదే సాటి. రామరావణులు ఎవరికి వారే సాటి. త్రికూటశిఖరంమీద నున్న లంకానగరంలో ఈ సమరం సాగుతుంది. సువేలాచలంపైకి ఎక్కి రామలక్ష్మణులు లంకానగరాన్ని రావణబలాన్ని చూస్తారు. సాగరలంఘనంతో సమరసన్నాహాలు సాగుతాయి. రాయబారాలు జరుగుతాయి. కాని, యుద్ధం తప్పనిసరి అవుతుంది. ధర్మాత్ముడు విభీషణుడు అధర్మయుద్ధంలో పాల్గొనటం ఇష్టంలేక ధర్మవత్సలుడైన రాముణ్ణి ఆశ్రయిస్తాడు. శత్రు సోదరుడని అణుమాత్రంకూడా సందేహించక శరణాగతునికి అభయం ఇస్తాడు, ఆర్తత్రాణ పరాయణుడయిన రాముడు. విభీషణ శరణాగతి రాముని ఔదర్యానికి ప్రబల నిదర్శనం. అంతేకాదు, రావణుడే వచ్చి శరణువేడినా అతణ్ణి క్షమించి గౌరవిస్తానంటాడు కరుణాలయుడైన కోదండ రాముడు.

రామరావణ యుద్ధంలో రాముడు సత్యాన్ని అనుసరించి ధర్మాన్ని స్థాపించేందుకు ప్రయత్నిస్తాడు. రావణుడు మసిపూసి మారేడుకాయ చేసి మోసంతో జయం సాధించాలని చూస్తాడు. నాగపాశంలో క్షణకాలం చిక్కుకొన్న రామలక్ష్మణులను మృతప్రాయులుగా సీతకు చూపించి ఆమెను లొంగదీసుకోవాలని చూస్తాడు. అలాగే మాయా సీతను సృష్టించి ఆమెను రణరంగంలో ఛేదించినట్టు హనుమంతుని యెదుట చూపించి రామ లక్ష్మణుల మనోబలాన్ని దిగజార్చేందుకు ఇంద్రజిత్తు పన్నాగం పన్నుతాడు. కాని, సత్యపరాక్రముడయిన రాముడు చలించడు. లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు మాత్రం విలపిస్తాడు. మాయ సీతను ఛేదించిన వార్త విని క్షోభిస్తాడు. కాని, రామ లక్ష్మణులు ఒకరి కొకరు ధైర్యం చెప్పకొని సమరాన్ని కొనసాగిస్తారు. రావణుడెంత దుష్టుడయినా అతని ధైర్యసాహ-

సాలను, పరాక్రమాన్ని ప్రాభవాన్ని రాముడు ఎలుగెత్తి కొనియాడుతాడు. తన భార్యను దొంగిలించి తనతో పోరాడేందుకు పాల్పడిన పరమ నీచుడు సమరంలో ఎదుట నిలబడినప్పుడు

అహో దీప్తో మహాతేజా రావణో రాక్షసేశ్వరః,
ఆదిత్య ఇవ దుష్ప్రేక్ష్యో రశ్మిభి ర్భాతి రావణః.

ఆహా! రాక్షస రాజయిన రావణుని తేజస్సు ఎంత దేదీప్యమానంగా ఉంది. సహస్ర కిరణాలతో కళ్ళకు మిరుమిట్లుగొలిపే సూర్యకాంతితో ప్రకాశిస్తున్నాడు. అని కీర్తించేందుకు ఎంతో హృదయ వైశాల్యం కావాలి. ప్రశంసించవలసిన లక్షణాలను ప్రశంసించి అతని దోషాలను తూలనాడటంలో కూడా రాముడు వెనుదీయడు.

దిష్ట్యాయ మద్య పాపాత్మా మమ దృష్టిపథం గతః,
అద్య క్రోధం విమోక్ష్యామి సీతాహరణసంభవమ్.

"ఈ పాపాత్ముడు చివరకు నా చేతుల్లో చిక్కుకున్నాడు. ఎలాగో నా కంటబడ్డ ఈ లోకకంటకుడు నా కోపానికి గురిగాకపోడు. నా భార్యను అపహరించిన నీచునికి తగిన శాస్తి చేస్తాను" అని రాముడు రావణుని మీద శరవర్షం కురిపిస్తాడు. రామబాణంలోని మర్మాంతకమైన మధురబాధను తొలిసారి చవిచూచిన రావణుడు చలిస్తాడు. పిడుగులు పడినా బెదరని రాక్షసరాజు రామబాణం తగలగానే చేతిలోని చాపాన్ని జారవిడుస్తాడు. ఇంతమంది రాక్షసులను అవలీలగా సంహరించిన యీ రాముడు సామాన్య మానవుడు కాడు, నారాయణుడే నరరూపంలో వచ్చి ఉంటాడని భావిస్తాడు. రాముడు కురిపించిన శరవర్షానికి తాళలేక రావణుడు తత్తరపాటు చెందుతూ ఉంటే రాముడు నవ్వుతూ అంటాడు.

గచ్ఛానుజానామి రణార్దిత స్త్వం
ప్రవిశ్య రాత్రించరరాజ లంకామ్,
ఆశ్వస్య నిర్యాహి రథీ చ ధన్వీ
తదా బలం ద్రక్ష్యసి మే రథస్థః.

పాపం, చాలా అలసిపోయినట్టున్నావు. ఈ రోజుకు ఈ బల ప్రదర్శన చాలు. ఇంటికి వెళ్ళు. బహుశా రాత్రిపూట సమరవిహారం చేసేందుకు

అలవాటు పడ్డ ప్రాణం కాబోలు! నిశ్చింతగా లంకకు వెళ్ళి రేపు మళ్ళీ మరో రథాన్నీ, ధనుస్సును తీసుకునిరా, అప్పుడు చూద్దువుగాని నా బలాబలాలు.

చంపదగిన శత్రువు చేతిలో చిక్కినా యిలా మంచి మాటలు చెప్పి విడిచిపెట్టటంలో రాముని ఔదార్యం, శౌర్యం, ఆత్మప్రత్యయం వ్యక్తమవుతాయి. ఈ మాటలకు రావణుడు సగం కుంగిపోతాడు. ఇంతకంటే మరణమే మేలని అనుకుంటాడు. మనుగడ మీది మమకారంతో తలవంచుకుని యింటికి వెళ్ళుతాడు. కుంభకర్ణుణ్ణి మేల్కొలుపుతాడు. కొండలాంటి తమ్ముడు క్షణంలో రాముడిచేతిలో కూలిపోతాడు. జిత్తులమారి ఇంద్రజిత్తు కూడా లక్ష్మణుని చేతుల్లో హతమవుతాడు. తన వాళ్ళందరూ ఒక్కొక్కరే తనువులు చాలిస్తారు. ఇక, శ్రీరామవిజయం, తనకు పరాజయం తప్పదని సీతనే సంహరించేందుకు పూనుకుంటాడు. సుపార్శ్వుడు అనే మంత్రి సీతపై కోపం సమరంలో చూపించటం వీరలక్షణమని వారించి ప్రేరేపిస్తాడు. సమరాంగణంలో రాక్షస సంహారం విపరీతంగా సాగుతుంది. విరూపాక్షుడు, మహోదరుడు, మహాపార్శ్వుడు అందరూ రణరంగంలో అసువులు అర్పిస్తారు. చివరకు రావణుడు మిగులుతాడు. ఇక, పలాయనం పనికిరాదని మొండి ధైర్యంతో రావణుడు పోరాడుతాడు. ఇంద్రుడు పంపిన రథం, మాతలి సారథ్యం, అగస్త్యు డిచ్చిన అస్త్రం, ఆదిత్యహృదయం అన్నింటినీ సమకూర్చుకొని సత్యపరాక్రముడు ధర్మవిజయాన్ని సాధిస్తాడు.

కాని, శ్రీరామవిజయం సీతకు అగ్నిపరీక్షగా పరిణమిస్తుంది. లంకలో గాలి స్వేచ్ఛగా వీస్తున్నది. సూర్యరశ్మి నిర్భయంగా లంకలోకి ప్రవేశిస్తున్నది. కాని, సీతామాతకు ఇంకా విజయవార్త అందలేదు. విభీషణ పట్టాభిషేకం తర్వాత హనుమంతుడు రాముని పంపున తల్లి దగ్గరికి వెళ్ళి చల్లని వార్తను చెపుతాడు. అమృతం కురిసే రామచంద్రుని వదనారవిందం ఎప్పుడు చూస్తానా అని పరితపిస్తున్న తపస్వినికి శుభవార్త చెప్పి ఆమె హృదయంలోని ఆర్తిని ఆర్తత్రాణ పరాయణుడయిన రామచంద్రునికి రామదూత విన్నవిస్తాడు. రామాజ్ఞ ప్రకారం విభీషణుడు సర్వాభరణ భూషితయైన లోకమాతను లోకనాయకుని సన్నిధికి తీసుకు వస్తాడు. కాని, రామచంద్రుని ముఖముద్రలో దారుణ గాంభీర్యం చూచి జానకి నివ్వెరపోతుంది. అమృతహృదయుడు అగ్నివర్షం కురిపిస్తాడు.

# వినయం

సీతమ్మకు రాముడొక్కడే కనిపిస్తున్నాడు. కాని, రామస్వామికి సీతతో పాటు లోకంకూడా కనిపిస్తున్నది. సీతను చూచిన కంటిలో కరుణ కరిగి ప్రవహిస్తూ ఉంటే, లోకాన్ని తిలకిస్తున్న కంటిని మహామానవుడు మంద-లిస్తున్నాడు. కనికరాన్ని కంఠంలో దాచుకొని కరుణాలయుడు కర్క-శమైన వాక్కును వెలయిస్తాడు. దేవతలకు కూడా బోధపడని (దేవైరపి దురన్వయా) శ్రీరామహృదయం దేవమాయవలె ప్రభవించిన (దేవమాయేవ నిర్మితా) సీత మనస్సుకే తెలియాలి. తన వంశాన్నీ, గౌరవాన్నీ, వ్యక్తి-త్వాన్నీ గుర్తించక కేవలం తనలోని స్త్రీత్వాన్ని పురస్కరించుకొని తనను తూలనాడుతున్న తన భర్తకు జానకి ఒక్కమాటలో సమాధానం చెప్పుతుంది. 'న తథాస్మి మహాబాహో యథా మా మవగచ్ఛసి' (నన్ను మీరు అనుకుంటున్నలాంటిదానిని నేను కాదు) అని సారగర్భితంగా తన నిజస్వరూపాన్ని నిరూపించుకుంటుంది. వీరవనిత కాబట్టి భర్త మనస్సును నొప్పించటం ఇష్టంలేక అగ్నికి ఆత్మార్పణం చేయటం శ్రేయస్కరమని భావిస్తుంది. శ్రీరాముడు చలించడు, ఔననడు, కాదనడు. హనుమం-తుడు ఖిన్నుడవుతాడు. లక్ష్మణుడు రాముని కనుసన్నలను గమనించి చితి పేరుస్తాడు.

కర్మణా మనసా వాచా యథా నాతిచరామ్యహమ్,
రాఘవం సర్వధర్మజ్ఞం తథా మాం పాతు పావకః.

రాఘవునికి తెలియని ధర్మం లేదు. అలాంటి సర్వధర్మజ్ఞునికి సహధర్మ-చారిణిగా ప్రవర్తించటంలో తన మనోవాక్కాయములకు సంబంధించిన లోపం ఏనాడు జరుగలేదు. అదే నిజమయితే అగ్నిదేవుడు తనను అన్ని విధాలా కాపాడగలడని అంటూ అగ్నిలాంటి సాధ్వి అగ్నిలో ప్రవేశిస్తుంది. ఈ మాటలు వి నగానే బ్రహ్మాది దేవతలు దివినుండి భువికి దిగి వస్తారు. సాక్షాత్ సృష్టికర్త శ్రీరాముని దివ్యత్వాన్ని అందరికి చాటిచెపుతాడు. స్వర్గంలో ఉన్న దశరథుడు మహేశ్వరుని ఆజ్ఞతో సీతారామలక్ష్మణులను

చూచి ఆశీర్వదించి వెళుతాడు. ఇదంతా రాముడికే ఆశ్చర్యంగా ఉంటుంది. "సోఽహం యశ్చ యతశ్చాహం భగవాం స్తద్ బ్రవీతు మే". అయితే ఇంతకూ నేనెవరినో ఎక్కడినుండి వచ్చానో వివరంగా చెప్పవలసిందని రాముడు బ్రహ్మదేవుణ్ణి అడుగుతాడు. రాముడు నర రూపంలో సాగించ-వలసిన ప్రయోజనం-- రావణసంహారం-- నెరవేరింది. ఇక ఆయన దివ్యత్వం ప్రపంచం గుర్తించినా ప్రమాదం లేదు. కాబట్టి ఇంతవరకు రామునిలో దాగియున్న దివ్యత్వాన్ని అందరూ గుర్తిస్తారు. అగ్నిదేవుడుకూడా అఘ మెరుగని ఆలిని అంగీకరించవలసిందని ఆజ్ఞాపిస్తాడు. ఈసందర్భంలో అగ్ని చెప్పిన మాటలు జాగ్రత్తగా గమనించదగినవి:

ఏషా తే రామ వైదేహీ పాప మస్యాం న విద్యతే,
నైవ వాచా న మనసా నైవ బుద్ధ్యా న చక్షుషా,
సువృత్తా వృత్తశౌండీర న త్వామత్యచర చ్ఛుభా.

విశుద్ధభావాం నిష్పాపాం ప్రతిగృహ్ణీష్వ మైథిలీమ్,
న కించి దభిధాతవ్య మహ మాజ్ఞాపయామి తే.

రామచంద్రా! ఇదిగో నీ వైదేహి, ఈమెను పాపం స్పృశించలేదు. మాటల్లోగాని, మనస్సులోగాని, ఆలోచనలోగాని, లోచనాల్లోగాని ఈమె ఎన్నడూ నిన్ను అతిచరించలేదు. నిన్ను తప్ప మరొకరిని తనవానిగా భావించలేదు. ఈమెలో ఎక్కడ చూచినా పావన భావనలే కాని, దురాలో-చనలు దూరేందుకు కూడా తావులేదు. కాబట్టి ఎదురుచెప్పక ఈమెను స్వీకరించు. ఇది నా ఆజ్ఞ.

అగ్నిదేవుని మాటప్రకారం అగ్నిసాక్షిగా రాముడు సీతను స్వీకరి-స్తాడు. ఈ సందర్భంలో సీతను 'వైదేహి'గా నిరూపించటంలో వాల్మీకి వాగ్విశేషం వ్యక్తమవుతుంది. విదేహరాజు కూతురు కావటంవల్ల ఆమె వైదేహి అయింది. అది కథాదృష్టి. తత్త్వదృష్టితో చూస్తే భూదేవి ప్రసవించిన సీతాదేవికి దేహంతో సంబంధం లేదు. దహనం దేహానికే గాని, వైదేహికి కాదు. కనుకనే అగ్నిలో ప్రవేశించికూడా అదగ్ధంగా, అక్షతంగా

బయటపడ్డది. 'నైనం దహతి పావకః' (అగ్ని దీనిని దహించలేదు) అని కొనియాడబడిన ఆత్మతత్త్వమే సీతాస్వరూపం.

అగ్నిలో శుద్ధిని పొందిన సీతాదేవిని తీసుకొని రాముడు అయోధ్య చేరుతాడు. దారిలో భరద్వాజాశ్రమంలో కొన్ని క్షణాలు గడపి మహాముని ఆశీస్సులు పొందుతాడు. రాముడితోపాటు విభీషణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, అంగదుడు మొదలయిన ఆత్మీయులు కూడా అయోధ్యలో శ్రీరామచంద్రుని పట్టాభిషేక మహోత్సవం చూచేందుకు వెళ్లారు. అందరూ పుష్పకవిమానంలో ఆనందంగా ప్రయాణం చేసి అయోధ్యను చేరుకుంటారు. అయోధ్యకు కొంచెం దూరంగా నందిగ్రామంలో భరతుడు క్షణ మొక యుగంగా అన్న రాకకోసం ఎదురు చూస్తూ వుంటాడు.

* * *

# భరతవాక్యం

శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణ సమేతుండై విజయం చేస్తున్నాడని ముందుగా హనుమంతునిద్వారా భరతునికి వర్తమానం అందుతుంది. భరతుడు పరమానంద పరవశుడై రాముని రాకకోసం ఎదురుచూస్తాడు. నిజంగా రాముడు వస్తున్నాడా అని సందేహం వచ్చి మళ్ళీ హనుమంతుణ్ణి అడుగుతాడు. దారిపొడుగునా ఫల పుష్పాలతో కళకళలాడే వనసంపద రాముని రాకను చెప్పక చెప్పటం లేదా అని హనుమంతుడు సమాధానం చెపుతాడు. రామతత్త్వం భరతునికంటె హనుమంతునికే బాగా బోధపడిందని భరతుడు గమనిస్తాడు. చివరకు రాముడు వస్తాడు. తమ్ముళ్ళను, తల్లులను కలుసుకొని వనవాస దీక్ష సక్రమంగా నెరవేరినందుకు తన ఆనందాన్ని ఆత్మీయులతో పంచుకొంటాడు. పద్నాలుగు సంవత్సరాల ముందు జరగవలసిన పట్టాభిషేకం, ఈనాడు జరిపించేందుకు అయోధ్యావాసులు ఏర్పాటు చేస్తారు. తల్లి మాట కాదనలేక అన్న తనకిచ్చిన రాజ్యాన్ని మళ్ళీ అన్నకు అప్పగిస్తూ భరతుడు చెప్పిన మాటలు రామరాజ్యానికి నాందినీ, రామాయణ మహాయనానికి భరతవాక్యాన్నీ పలుకుతాయి.

ఈ భరతవాక్యాన్ని వాక్యజ్ఞుడైన వాల్మీకి ఎంత రసాత్మకంగా పలికిస్తాడో పరికించాలి:

పూజితా మామికా మాతా దత్తం రాజ్య మిదం మమ,
తద్ దదామి పునస్తుభ్యం యథా త్వమదదా మమ.

"అమ్మ చెప్పిన మాటను ఆదరించి ఆమెను ఆరాధించాము. ఆమె కోరిన ప్రకారం నీవు నాకిచ్చిన రాజ్యాన్ని మళ్ళీ నీకు యథాతథంగా అప్పజెపుతున్నాను" అంటాడు భరతుడు. మాట దాటని భరతుడు, తండ్రి మాట నెరవేర్చిన రాముడు ఇక్ష్వాకువంశ ప్రతిష్ఠను నిలబెట్టారు. కాని, అయోధ్య కేవలం రామ భరతులకు సంబంధించింది కాదు. ప్రపంచమంతా రామరాజ్యంకోసం ఎదురుచూస్తున్నది. తన కోరికమీద కాకపోయినా ప్రజల కోరికనైనా మన్నించి రాముడు రాజ్యభారాన్ని వహించాలని భరతుని అభిమతం.

జగదద్యాభిషిక్తం త్వా మనుపశ్యతు రాఘవ,
ప్రతపంత మివాదిత్యం మధ్యాహ్నే దీప్తతేజసమ్.

మధ్యాహ్నవేళ నిండువెలుగుతో జ్యోతిర్మండలం మధ్య ప్రకాశించే ప్రభాకరునిలా శ్రీరాముడు అయోధ్యకు రాజుగా పట్టాభిషిక్తుడవటం ప్రపంచానికే ముదావహం. లోకం ఈ అవకాశంకోసం ఎదురుచూస్తున్నది. అంతేకాదు, రామరాజ్యం ఒకనాటికి పరిమిత మయింది కాదు. సార్వభౌ-మంగా, సార్వకాలికంగా సారస్వతసామ్రాజ్యాన్ని స్థాపించగల సామర్థ్యం శ్రీరామచంద్ర ప్రభువుకు ఉంది. ఈ పరమ సత్యాన్ని భరతుడు పరమ రమణీయంగా చెప్తాడు:

యావదావర్తతే చక్రం యావతీ చ వసుంధరా,
తావత్ త్వమిహ లోకస్య స్వామిత్వ మనువర్తయ.

ఇది భరతుని చివరి వాక్యం. మధ్యాహ్నం నభోమండలంలో ప్రకాశించే ఆదిత్యుని కాంతివలె భూమండలంలో శాశ్వతంగా విలసిల్లే రామరాజ్యం ఎలా ఉంటుందో ఈ శ్లోకం చాల ధ్వన్యాత్మకంగా వివరిస్తుంది. కాలచక్రం సక్రమంగా తిరుగుతున్నంతవరకూ, ఈ కాలగతితో వసుమతి పునర్వసు వికాసంతో వర్ధిల్లుతున్నంతవరకూ అన్నగారు లోకస్వామిగా ఉండి లోక కల్యాణం సాధించవలెనని యీ భరతవాక్యంలోని వాచ్యార్థం. కాని, యీ రసాత్మకమైన వాక్యంలోని ధ్వనిని గమనించేందుకు మధ్యాహ్నం, చక్రం, వసుంధర, లోకం, అనువర్తయ-- అనే మాటలను జాగ్రత్తగా పరిశీలించాలి.

ప్రతి సంవత్సరం శ్రీరామనవమినాడు రామచంద్రుని జన్మోత్సవంతో-పాటు సీతాకల్యాణం, పట్టాభిషేకం వేడుకగా చేసుకోవటం రామభక్తులకు అలవాటు. ప్రతిసంవత్సరం జన్మదినం చేసుకోవటం పరవాలేదు. కాని మాటిమాటికి కల్యాణం, పట్టాభిషేకం చెయ్యటం అంత సమంజసంగా లేదని కొందరు ఆక్షేపించటం కూడా చూస్తుంటాము. తెలిసి చేసినా, తెలియక చేసినా ఈ రామనవమి ఉత్సవాలలో గొప్ప జ్యోతిర్మయమయిన రహస్యం ఉంది. ఈ రహస్యమే భరతవాక్యంలో ఇమిడిఉంది. సూర్యుడు మేషంలో ఉండగా చంద్రుడు కర్కాటకరాశిలో పునర్వసునక్షత్రంలో ప్రవేశించిన

శుభముహూర్తమే శ్రీరామనవమి. అలాగే సూర్యుడు సింహరాశిలో ఉండగా చంద్రుడు వృషభరాశిలో రోహిణి నక్షత్రంలో ప్రవేశించిన పుణ్యదినాన్ని జన్మాష్టమి లేక శ్రీజయంతి అంటాము. చాంద్రమానానికి ప్రచారం వచ్చిన తర్వాత నవమి అష్టమి ఈ రెండు పండుగలకు ప్రధాన తిథులైనాయి. కాని, తాత్త్వికదృష్టితో చూస్తే సూర్యచంద్రుల పరస్పర సంబంధాన్ని పురస్కరించుకొని యీ రెండు పండుగలు ఏర్పడ్డాయి. సూర్యమండలంలోని ప్రతిగ్రహానికీ ఒకరాశి ఉచ్చస్థానంగా ఉంటుంది. అలాగే మరో రాశి స్వక్షేత్ర మవుతుంది. ఈదృష్టితో చూస్తే మేషం సూర్యుడికి ఉచ్చరాశి, సింహం స్వక్షేత్రం. వృషభం చంద్రుడికి ఉచ్చరాశి. కర్కాటకం స్వక్షేత్రం. అంటే సూర్యుడు ఉచ్చ(మేషం)లో ఉండగా చంద్రుడు స్వక్షేత్రం (కర్కాటకం)లో పునర్వసులోకి వచ్చినప్పుడు సూర్యవంశపు రాజయిన రామచంద్రునికి పర్వకాల మవుతుంది. అలాగే సూర్యుడు స్వక్షేత్రం (సింహం)లో ఉండగా చంద్రుడు ఉచ్చ(వృషభం)లో రోహిణీ నక్షత్రంలో ప్రవేశించినపుడు చంద్రవంశప్రభువైన శ్రీకృష్ణుని జయంతి వస్తుంది. సూర్యవంశ ప్రభువు మధ్యాహ్నం అవతరిస్తే చంద్రవంశపు స్వామి అర్ధరాత్రి ఆవిర్భవించాడు. దీనినిబట్టి రామకృష్ణుల జ్యోతిర్మయస్వరూపం మనకు స్పష్టంగా గోచరిస్తుంది. సంవత్సర పరిమితిలో సంభవించే సూర్యచంద్రుల యీ పరస్పర సన్నివేశాలను మహర్షులు ప్రత్యక్షంగా భావించి అనుభవించి వీటికి మహత్తరమైన రూపకల్పన చేశారు. కాలస్వరూపుడయిన పరమాత్ముడు చైత్ర(మేష)మాసంలో రామస్వామిగా, శ్రావణ(సింహ) మాసంలో కృష్ణపరమాత్మగా సాక్షాత్కరిస్తాడు. ఒకే పరతత్త్వం కాలగతిని బట్టి రెండు రూపాలలో తన ఆరాధ్యస్వరూపాన్ని కాలజ్ఞులకు అవగతంచేస్తుంది. కాలచక్రంలోని యీ బిందువునే వసుంధర కలకాలం ధరిస్తుందనీ, దానికి ప్రభువుగా రామస్వామి లోకాలోకాన్ని అనువర్తిస్తూ ఉంటాడని భరతుని వాక్యంలోని అంతరార్థం. ఈభరతవాక్యమే రామాయణ పరమార్థం.

రామరాజ్యం లాగానే రామనామం, రామాయణం, రామతత్త్వం కూడా సార్వకాలికమైన, సార్వభౌమమయిన సారస్వత సామ్రాజ్యాన్ని నెలకొల్పగల సనాతన సత్యాలని పై భరతవాక్యంలోని సందేశసారం కథగా వ్రాశినాను.

కావ్యంగా భావించినా, నీతి సంహితగా నిర్వచించుకున్నా, యోగశాస్త్రంగా అన్వయించుకున్నా, రామాయణం సారస్వత పారిజాతంగా గోచరిస్తుంది. సామాన్య జనులకు అది చక్కని కథ. రసజ్ఞులకు అది రమణీయమైన కావ్యం. నీతికోవిదులకు నీతిశాస్త్రం. యోగులకు యోగశాస్త్రం. మంత్ర సాధకులకు మంత్రరాజం. ఇలా ఏ దృష్టితో చూస్తే అలా గోచరించే పలువన్నెల భవ్య చిత్రాన్ని ఇంద్రధనుస్సులాంటి యీ ఉద్గ్రంథం ప్రపంచానికి అందిస్తూ ఉంది.

"ఈ రోజుల్లో రామాయణా లెందుకండీ?" అని చాలామంది మేధావులు ప్రశ్నిస్తూ ఉంటారు. కాని, కేవలం కథగా చూచినా ప్రపంచంలోని కథాసాహిత్యంలో రామాయణ కథ అగ్రస్థానం వహించింది. భారతంలో, భాగవతంలోకూడా అనేక కథలున్నాయి. పంచతంత్రం, కథాసరిత్సాగరం లాంటి మనోహర కథా సంకలనాలుకూడా కొల్లలుగా ఉన్నాయి. కాని జన సామాన్యంలో ఆబాలగోపాలానికి ఆహ్లాదం కలుగజేస్తున్న కథారత్నం రామాయణమే నని చెప్పాలి. 'చూచి రమ్మంటే కాల్చి వచ్చా'డనీ, రామ లక్ష్మణుల్లాంటి అన్నదమ్ములనీ, పితృవాక్య పరిపాలనలో అతడు రాముని లాంటి వాడని, వాలి సుగ్రీవుల్లా అస్తమానం తగవులాడుతూ ఉంటారని, చుప్పనాతి శూర్పణఖ అనీ, కుంభకర్ణుడిలా నిద్రపోతున్నాడనీ, అహల్యలా పడి ఉన్నదనీ, అగస్త్య భ్రాత అనీ - ఇలా ఎన్నో సామెతలు నిత్య జీవితంలో రామకథను పురస్కరించుకొనే ప్రవేశించాయి. మానవులు, దానవులు, వానరులు, పశుపక్ష్యాదులు, కొండలు, సముద్రాలు -- అన్నీ రామాయణంలో కావ్యవస్తువులే, అన్నింటికీ సమానమైన ప్రాధాన్యమే. వాల్మీకి ఋషి దృష్టికి జడచేతన భేదమే లేదు. ఎంత మహోన్నతమైన ఆదర్శాన్ని చిత్రించినా యథార్థజీవితం మీది అనురాగం ఋషివాక్కులో అడుగడుగునా వ్యక్తమవుతూ ఉంటుంది. సర్వగుణ సంపన్నుడయిన రాముడుకూడా సామాన్య మానవుడిలా పరిహాసం చేస్తాడు. కష్టసమయంలో కన్నీరు కారుస్తాడు కోపావేశంతో ప్రపంచాన్ని మింగేట్లు పరుషంగా మాట్లాడుతాడు, అనుమానిస్తాడు, ఆలోచిస్తాడు, ఆమోదిస్తాడు, ఆనందిస్తాడు. అలాగే సర్వలక్షణసంపన్నురాలయిన సీతమ్మకూడా లక్ష్మణుడిలాంటి మరిదిని అన

రాని మాట లంటుంది. ఫలితం అనుభవిస్తుంది. గొప్పవంశంలో పుట్టి గొప్పచక్రవర్తికి పట్టపురాణి అయిన కైకేయిమనస్సులోకూడా మంథర మాత్సర్యం ప్రవేశిస్తుంది. అయినా చివరకు సత్యమే జయిస్తుంది. రాక్షసవంశంలో కూడా విభీషణుడులాంటి యోగ్యుడు, త్రిజటలాంటి త్రికరణ శుద్ధి గల స్త్రీలు కనిపిస్తారు. రావణుడుకూడా అసలు మంచివాడుగానే కనిపిస్తాడు. పరిస్థితులు, మనస్థితులు అతనిలోని అసురత్వాన్ని రెచ్చగొట్టినట్టు తోస్తుంది. సాధువేషంలో సీతను సమీపించిన రావణుడు సీత మనస్సులో చివరివరకు సాధువుగానే నిలిచిపోతాడు. బుద్ధిమంతుడైన హనుమంతుడు మొట్టమొదట మండోదరిని చూచి ఆమె సీతాదేవి అని భావిస్తాడు. మండోదరికీ సీతకూ గల రూప సామ్యం ఇద్దరినీ ఒక కోవకు చెందిన మహాపతివ్రతలుగా నిరూపిస్తుంది. ఇలా మంచినీ, చెడునూ కలగలుపుగా మిళితంచేసి లోకధర్మాన్ని ఆలోక మధురంగా చిత్రించటంవల్ల రామాయణకథ ఆచంద్రార్కంగా జనమానసంలో నిలిచిపోయింది.

కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మే,
ఏతి జీవంత మానందో నరం వర్షశతాదపి.

పంచవటిలో రావణుడు తనను వంచించిన తర్వాత జరిగిన రామలక్ష్మణుల వృత్తాంతం హనుమంతుడి ద్వారా విని అణువణువునా ఆనందంతో పొంగిపోయిన సీతామాత యీ మాట అంటుంది. కల్యాణకరమైన వృత్తాంతం వింటుంటే వందలకొలది సంవత్సరాలుకూడా హాయిగా ఆనందంగా గడచిపోతాయుట. వినేందుకు లోకసహజంగా ఉన్నప్పటికీ ఈ కథలో ఏదో లోకోత్తరమైన సనాతన సత్యసారం ఉన్నదట.

అలాగే, అరణ్యావాసం నుండి తిరిగివస్తున్న రామలక్ష్మణుల వృత్తాంతం హనుమంతుడి ద్వారా విన్న భరతుడుకూడా పరమానంద భరితుడై సరిగా ఇదే మాట అంటాడు. ఇలాంటి శ్లోకాలు కొన్ని వాల్మీకి రామాయణంలో యథాతథంగా రెండు మూడు మార్లు వస్తాయి. వాటిని కొంచెం మెలకువతో గమనించాలి. అవి మాటలు కావు, మంత్రాలు.

కావ్యదృష్టితో చూచినా రామాయణం ఆదికావ్యం అనిపించుకుంది. ఇందులో ఒక్కొక్క వాక్యానికి రసాత్మకమైన కావ్యఖండాన్ని వెలయింపజేయగల శక్తి ఉంది. రామాయణాన్ని ఆధారం చేసుకొని దేశభాషల్లో అనేక ఖండకావ్యాలు, మహాకావ్యాలు, గేయకావ్యాలు, నాటకాలు, పాటలు, నృత్యగీతికలు వెలిశాయి. ఇంతటి సారవంతమైన కావ్యవస్తువు రామాయణం తర్వాత భారత భాగవతాల్లోనే కనిపిస్తుంది. ఒక విధంగా చూస్తే రామాయణం భారతీయ సంస్కృతిని శారీరకమీమాంసగా చిత్రిస్తుంది. మహాభారతం భారత భారతీ మనస్తత్త్వాన్ని మనోహరంగా వ్యాఖ్యానిస్తుంది. భాగవతం భారతీయ తత్త్వజిజ్ఞాసతో ఆత్మతత్త్వాన్ని పరమభాగవతపరంగా వివరిస్తుంది. కనుకనే రామాయణం, మహాభారతం, భాగవతం భారతీయ సంస్కృతికి కండపుష్టినీ, గుండెబలాన్నీ, నిండుదనాన్నీ సమకూర్చినట్టు భావించటంలో పొరబాటు లేదు.

"తదుపగత సమాససంధియోగం
సమమధురోపనతార్థ వాక్యబద్ధమ్,
రఘువరచరితం మునిప్రణీతం
దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్".

అని కీర్తింపబడిన రామాయణ మహాకావ్యం సరసమైన సమాస సంయోగంతో తియ్యని భావాలను వెలయించే కమ్మని వాక్యాలతో సరస రమణీయంగా, ప్రతిపద మాధుర్యంతో కావ్యజగత్తుకు శాశ్వతమైన శోభ చేకూర్చింది. కొన్ని ప్రక్షిప్త భాగాలను వదలివేస్తే వాల్మీకి కావ్యంలో అనన్య సామాన్యమైన ఔచిత్యం, సౌష్ఠవం, సహజ మాధుర్యం పుష్కలంగా కనిపిస్తాయి. సర్గవిభజనలోనే నిసర్గ లావణ్యం గోచరిస్తుంది. తపశ్చక్షువులతో తాను చూచిన వృత్తాంతాన్ని చూచినది చూచినట్టుగా తూచినట్టు వేరు వేరు దృశ్యాలను వేరు వేరు సర్గలుగా విభజించుకొని వివరించిన వాల్మీకి రామాయణంలోని సర్గలు నిజంగా సర్గ(సృష్టి)ఖండికలు. ఏ సర్గ ఎంత పరిమితి కలిగిఉండాలని నిర్ణయించటంలో వాల్మీకి దిట్ట. సమ స్సమవిభక్తాంగుడైన కావ్యనాయకునివలెనే కావ్యం కూడా సర్వాంగ సౌష్ఠవంతో

సమృద్ధంగా కనిపిస్తుంది. ఈ సర్గ విన్యాసానికి తోడు నిరాడంబరమైన భాషాశైలి పాఠకులను మాటిమాటికి చదివి మననం చేసుకునేందుకు ప్రేరేపిస్తుంది. కనుకనే రామాయణం పారాయణ గ్రంథమయింది. భాషాదృష్టితో చదివినా రామాయణం పండితులకు, పామరులకు కూడా కావలసిన శబ్దశక్తి, అర్థపుష్టి, భావనా సామర్థ్యం ప్రసాదిస్తుంది. "ఈ సంసారమిదెన్ని జన్మలకునేనిన్ మౌని వాల్మీకి భాషా సంక్రాంత ఋణంబు తీర్పఁగలదా?" అని వెయ్యిమంది విశ్వనాథులు ప్రశ్నించుకున్నా సమాధానం చెప్పగల అక్షయ భాషానిధి రామాయణ మహాకావ్యం.

నీతిసంహితగా చూస్తే రామాయణంలో లేని నీతి లేదు. నీతిని ప్రీతితో చెప్తేనేగాని సామాన్యుల హృదయంలో అది హత్తుకుపోదు. వాల్మీకి తనంతట తాను నీతిని బోధించినట్టు ఎక్కడా కనిపించదు. కథలో అంతర్లీనంగా పాత్రపోషణలో భాగంగా సమస్త నీతులు ధ్వనిస్తాయి. బుద్ధిమంతులు తమకు తెలియకుండానే ఆ నీతులను గ్రహిస్తారు. మానవ జీవితంలో మధురాతిమధురమైన సన్నివేశాలు, కఠిన శిలలను కరిగించే కరుణ గాథలు, అసుర కృత్యాలను ఆప్యాయతతో అంతరింపజేసే సౌహార్ద నిదర్శనలు రామాయణంలో రసనిర్భర పదబంధంతో పాఠకులను ఆకట్టుకుంటాయి. ప్రభు సమ్మితమైన వేదనాదాన్ని కాంతా సమ్మితమైన కావ్య భాషలో పలికించిన భవ్యరచన రామాయణం.

ఇక తాత్త్విక దృక్పథంతో చూస్తే రామాయణం శారీరకమీమాంసగా కనిపిస్తుంది. వేదాంతులు తమ వేదాంత దర్శనాన్ని శారీరక మీమాంస అనే పేర్కొన్నారు. దీనినే బ్రహ్మసూత్రం అనికూడా అన్నారు. సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ బ్రహ్మసూత్రం రామాయణంలో కూడా కనిపిస్తుంది. షట్కాండల్లో సంచరించే రామాయణ మహాయనంలో షట్చక్రాలు గోచరిస్తాయి. కైకేయి వర యాచనలో మూలాధారం, చిత్రకూటంలో స్వాధిష్ఠానం, అత్రి, అనసూయ, అగస్త్యుల ఆతిథ్యంలో మణిపూరం, కబంధవధలో అనాహతం, పంపా సందర్శనంలో విశుద్ధి, సుగ్రీవాజ్ఞలో ఆజ్ఞాచక్రం స్పష్టంగా కనిపిస్తాయి. సీతాసందర్శనమే సహస్రార బిందు సందర్శనం. రామాయణంలోని పాత్రల

పేర్లు కూడా (వాలి, సుగ్రీవుడు, కుంభకర్ణుడు, శూర్పణఖ, ద
కబంధుడు, త్రిశిరుడు) శరీరంలోని అవయవాలకు సంబంధిం
గమనించదగ్గ విషయం. రాముడు ప్రాణస్వరూపుడు. సీతాదే
స్వరూపిణి. ప్రణవ సమేతమైన ప్రాణ సంచారమే సీతారాము
అదే రామాయణం.

ఈ దృష్టితో చూస్తే రామాయణం ఒక మహామంత్ర
స్తుంది. వేదమాత అయిన గాయత్రిలోని బీజాక్షరాలు రా
పొదిగి ఉండటం వల్ల చతుర్వింశతి సాహస్రిక (ఇరవై నాలుగ
సంపుటి)గా పేరు పొందిన యీ మహాగ్రంథం మంత్రపూరి
మంత్రరాజంగా కూడా మంత్రద్రష్టల మన్ననలను పొంది వ
పరిగణింపబడింది. ఇది అనుభవం వల్ల తెలుసుకోవలసిన ప
యణంలోని యీ పరమార్థం గ్రహించగలిగిన మహానుభావులు
ఒక్కొక్క అక్షరాన్ని అక్షయపుణ్యకోశంగా భావించారు.

చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరమ్,
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్.

* * *